



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 239 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 6 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 239 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 6 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# తృతీయ వర్ధంతి



చిరంజీవి **నవులూరి లహరి**

**జననం : 11-03-2008 మరణం : 06-05-2022**

నీ రూపం మా కళ్ళఎదుటనే ఉంది, నీ మాటలు మాకు ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి
నీ చిరునవ్వు మాకు కనిపిస్తూనే ఉంది, నీవులేవనే మాట మా శ్వాసకు అడ్డుపడుతూనే ఉంది,
నీవు మా మధ్యలేకున్నా మా అందరి మనసులు
నీ హృదయాన్ని పలకరించగలవని ఆశతో జీవిస్తున్నాము.

మమ్మల్ని వీడి ఆకస్మిక మరణం పొందిన నీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ....

ఇట్లు : అమ్మ - నాన్న

**నవులూరి సుధీర్ - ప్రమీల**

తమ్ముడు : **నవులూరి ప్రదీప్**

మరియు కుటుంబసభ్యులు








# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 239 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 6 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 239 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 6 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nellore,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలి

- అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించాలి
- రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి
- పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య నాయకులకు వైయస్ జగన్ ఆదేశం



**తాడేపల్లి:** కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ముఖ్య నాయకులను ఆదేశించారు. అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించి ధైర్యం చెప్పాలని, రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. అందుబాటులో ఉన్న రీజినల్ కో–ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్యనాయకులతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలని కోరారు.

**అధికార యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది..**

అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రాష్ట్రంలో పలుచోట్ల ధాన్యం తడిసిపోవడంతో పాటు అనేక ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వైయస్ జగన్ అన్నారు. వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కళ్లాల్లో, పొలాల్లో రైతుల వద్దనున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపారని, యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉందని తీవ్రంగా మండిపడ్డారు. ఖరీఫ్‌లో ప్రతికూల వాతావరణం, కనీస మద్దతు ధరలు లభించక తీవ్ర ఇబ్బందులు పడ్డ వరి రైతులు.. ఈ రబీ సీజన్‌లో కూడా కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించడం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు అకాల వర్షాలవల్ల మరింతగా నష్టపోతున్నారంటూ తన దృష్టికి వచ్చిన అంశాలను వైయస్ జగన్ పార్టీ నాయకులతో చర్చించారు. దీంతోపాటు పలు ఉద్యానవన పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. పంటలు దెబ్బతిన్న

ప్రాంతాల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి రైతులకు బాసటగా నిలవాలని, వారిని ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని వైయస్ జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.



## వైసీపీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయి

- కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ. 1.50 లక్షల కోట్ల అప్పు చేసిందన్న బొత్స
- అభివృద్ధి, సంక్షేమాన్ని జగన్ రెండు కళ్లుగా చూశారని కితాబు
- మూడు టీవీ ఛానళ్లు, పేపర్లతో చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శ

గత ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై ఆ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణుడి చావుకు వంద కారణాలు ఉన్నట్టుగా... వైసీపీ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఈరోజు వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొత్స, గుడివాడ్ అమర్ నాథ్, ధర్మశ్రీ, బూడి ముత్యాల నాయుడు, కన్నబాబు, వరుదు కల్యాణి, శోభ హైమావతి, బొడ్డేడ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే రూ. 1.50 లక్షల కోట్లు అప్పు చేసిందని విమర్శించారు. మళ్లీ పెళ్లి అన్నట్టుగా అమరావతి పనులకు పునఃప్రారంభం చేశారని ఎద్దేవా చేశారు. అమరావతికి వచ్చిన మోదీ ఏం ఇచ్చారని ప్రశ్నించారు.

వివరాలు 2లో..

## భారత రక్షణ శాఖ వెబ్‌సైట్లపై పాకిస్థాన్ హ్యాకర్ల దాడి

- పహల్గామ్ దాడి తర్వాత.. సైబర్ దాడులకు పాల్పడుతున్న పాకిస్థాన్
- సున్నితమైన సమాచారం, లాగిన్ వివరాలు హ్యాకర్ల చేతికి చిక్కి ఉండవచ్చని ఆందోళన
- మరిన్ని సైబర్ దాడులు జరగకుండా భారత రక్షణ వ్యవస్థ అప్రమత్తం



పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తానీ హ్యాకర్లు భారత రక్షణ రంగ వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ సైబర్ దాడుల వల్ల రక్షణ సిబ్బందికి సంబంధించిన సున్నితమైన సమాచారం, లాగిన్ వివరాలు హ్యాకర్ల చేతికి చిక్కి ఉండవచ్చని

వివరాలు 2లో..

## 'బిగ్ బాస్' ఖరీదైన వ్యభిచారం, అందాల పోటీలతో అమ్మాయిలను ప్రదర్శన వస్తువులుగా మార్చడమే!

- బిగ్ బాస్ యువతను తప్పుదారి పట్టిస్తోందన్న నారాయణ
- పెళ్లి కాని వాళ్లు ఒకే మంచంపై పడుకోవడం ఏమిటని మండిపాటు
- బిగ్ బాస్ ను నిషేధించాలని కొంతకాలంగా ప్రయత్నిస్తున్నానని వెల్లడి





సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ మరోసారి బిగ్‌బాస్ రియాలిటీ షోపై, హైదరాబాద్‌లో జరగనున్న అందాల పోటీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుపతిలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు కార్యక్రమాలు సమాజానికి, సంస్కృతికి హానికరమని ఆయన అభిప్రాయపడ్డారు.

వివరాలు 2లో..

## పాకిస్తాన్‌లో భూకంపం..

### భయంతో ఇళ్ల నుంచి జనం పరుగులు.. వారంలో రెండోసారి..



ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడితో కయ్యానికి కాలు దువ్వి యుద్ధ భయంతో వణికిపోతున్న పాకిస్తాన్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 4.2 తీవ్రతతో సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పాకిస్తాన్?లో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ పేర్కొంది. పాకిస్తాన్‌లో భూకంపం సంభవించడం వారం వ్యవధిలో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఏప్రిల్ 30వ తేదీన కూడా పాకిస్తాన్‌లో భూకంపం కారణంగా కొంత భూభాగం కుదుపునకు లోనైంది. పాకిస్తాన్‌లో ఇటీవల తరచుగా భూకంపాలు


వివరాలు 2లో..

## పహల్గాం దాడిని ఖండిస్తున్నాం..దోషులను వదలొద్దు..

### ప్రధానిమోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్


- ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్... పూర్తి మద్దతుగా ఉంటామని హామీ
- పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన పుతిన్
- దాడికి పాల్పడిన వారిని, వారికి మద్దతు ఇచ్చిన వారిని శిక్షించాలన్న రష్యా అధినేత
- భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న బలమైన మైత్రి

వివరాలు 2లో..



## ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ

- పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ
- ఏప్రిల్ 22 పహల్గామ్ దాడి అనంతరం భద్రతా పరిస్థితి, సైనిక సన్నద్ధతపై చర్చ
- పశ్చిమ సరిహద్దుల్లో తాజా పరిస్థితిని ప్రధానికి వివరించిన రక్షణ కార్యదర్శి
- పాకిస్తాన్ నుంచి కొనసాగుతున్న కాల్పుల విరమణ ఉల్లంఘనలు
- ఇప్పటికే పాక్‌పై పలు దౌత్యపరమైన చర్యలు చేపట్టిన భారత్



పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ నేడు ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం

వివరాలు 2లో..

## రాయలసీమ గడ్డ నా అడ్డా... ఖబడ్దార్

### వైసీపీకి బాలకృష్ణ మాస్ వార్నింగ్

- టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని బాలయ్య హెచ్చరిక
- ఏడాదిలోపే నియోజకవర్గంలో రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని వెల్లడి
- టీడీపీ జవాబుదారీతనంతో పనిచేస్తుందని వ్యాఖ్య

రాయలసీమ గడ్డ తన అడ్డా అని... సీమ జోలికి వచ్చినా, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల జోలికి వచ్చినా సహించేది లేదని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వైసీపీ నేతలను తీవ్రంగా హెచ్చరించారు. ఈరోజు హిందూపురం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన, పలు

వివరాలు 2లో..



## ఈ సమస్యపై భారత్, శ్రీలంక ప్రభుత్వాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి



- తమిళనాడు మత్స్యకారుల ఘటనలపై పవన్ ఆందోళన
- సమస్య పరిష్కారానికి భారత్, శ్రీలంక ప్రభుత్వాలు చర్చలు జరపాలని సూచన
- మోదీ, చంద్రబాబుతో కలిసి అమరావతిని అభివృద్ధి చేస్తామని వెల్లడి

బంగాళాఖాతంలో ఇటీవల తమిళనాడుకు చెందిన 24 మంది మత్స్యకారులు శ్రీలంక అధికారుల వల్ల ఇబ్బందులకు గురైన ఘటనలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాగపట్నం జిల్లా మత్స్యకారులు గాయపడటం బాధాకరమని పేర్కొన్నారు. భారత్, శ్రీలంక మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, తరచూ పునరావృతమవుతున్న

వివరాలు 2లో..



## పాకిస్థాన్‌కు నిధులు ఆపేయండి

### ఏడీబీకి భారత్ విజ్ఞప్తి

- పాకిస్థాన్‌పై దౌత్య ఒత్తిడి పెంచిన భారత్
- పాకిస్తాన్‌కు ఏడీబీ ఆర్థిక సహాయం నిలిపివేయాలన్న భారత్
- ఏడీబీ చీఫ్‌తో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్చలు
- ఇటలీ, ఇతర యూరప్ దేశాలతోనూ సంప్రదింపులు జరుపుతున్న భారత్

వివరాలు 2లో..

పహల్గామ్ మారణకాండ నేపథ్యంలో పాకిస్థాన్‌పై దౌత్యపరమైన చర్యలను భారత్ ముమ్మరం చేసింది. పాక్ కు అందుతున్న అంతర్జాతీయ ఆర్థిక సహాయాన్ని నిలిపివేయించే దిశగా

## ఎడిటర్ వ్యూ

### జగన్.. ప్రయోగాలకు ఫుల్ స్టాప్ పెట్టేసినట్లేనా?

# మూడేళ్లకు ముందు నుంచే

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అభ్యర్థుల ఎంపికలో ప్రయోగాలకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. శింగనమల నియోజకవర్గంలో వైసీపీ ఎప్పుడూ స్ట్రాంగ్ గా ఉంటుంది. అయితే గత ఎన్నికల్లో జగన్ అతి విశ్వాసంతో చేసిన ప్రయోగం వికటించింది. అది టీడీపీకి వరంగా మారింది. 2019 ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఎన్నికయ్యారు. అయితే ఆమెకు 2024 టిక్కెట్ ఇవ్వడానికి నిరాకరించారు. శింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల్లో తలెత్తిన విభేదాల కారణంగా జొన్నలగడ్డ పద్మావతిని పక్కన పెట్టాల్సి వచ్చింది. అదే సమయంలో 2024 ఎన్నికల్లో ఆమెను కాదని శింగనమల నియోజకవర్గం టిక్కెట్ ను వీరాంజనేయులుకు ఇచ్చారు. ఆయన టిప్పర్ డ్రైవర్ గా ఉన్నప్పటికీ జగన్ తన బొమ్మతో నైనా వీరాంజనేయులు గెలుస్తారన్న నమ్మకంతో టిక్కెట్ ఇచ్చారు.

**టిప్పర్ డ్రైవర్ కు...**

వీరాంజనేయులు టిప్పర్ డ్రైవర్ అని, చంద్రబాబు ఏ టిప్పర్ డ్రైవర్ కైనా ఇచ్చాడా? అంటూ రాష్ట్రమంతటా ఎన్నికల ప్రచారంలో జగన్ పెద్దయెత్తున ప్రచారం చేశారు. తాను పేదల పక్షపాతినని, పార్టీ కోసం కష్టపడిన వారికి టిక్కెట్లు ఇస్తామని, అదే సమయంలో అన్ని సామాజికవర్గాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా డబ్బును చూడనని, కేవలం చట్ట సభలకు తీసుకెళ్లి వారి గొంతును వినిపించడమే లక్ష్యమని బిల్డప్ ఇచ్చారు. అయితే వీరాంజనేయులు గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిపై వైసీపీ అభ్యర్థి ఎం. వీరాంజనేయులు దాదాపు ఆరువేల పై చిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు వీరాంజనేయులు పార్టీ ని నియోజకవర్గంలో బలోపేతం చేయలేకపోతున్నారు.

**శైలజానాథ్ కే టిక్కెట్...**

అయితే వీరాంజనేయులు స్థానంలో తిరిగి జొన్నలగడ్డ పద్మావతిని తీసుకువస్తారని భావించినా ఇప్పుడు కాంగ్రెస్ నుంచి సాకే శైలజానాథ్ పార్టీలో చేరడంతో ఆయనకు శింగనమల నియోజకవర్గం బాధ్యతలను అప్పగించారు. సాకే శైలజనాథ్ కు మంచి పేరు ఉంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేశారు. ఆయనకంటూ సొంత వర్గం అంటూ ఉంది. అందుకే జొన్నలగడ్డను, వీరాంజనేయులును పక్కనపెట్టి వచ్చే ఎన్నికల్లో సాకే శైలజానాథ్ కు టిక్కెట్ హామీ జగన్ ఇచ్చేశారంటున్నారు. ఆయనైతే గెలుపు సులువవుతుందన్న నమ్మకంతో జగన్ శైలజానాథ్ కు పార్టీలో కూడా కీలక బాధ్యతలను అప్పగించే యోచనలో ఉన్నారంటున్నారు.

**మూడేళ్లకు ముందు నుంచే...**

ఇక అనేక నియోజకవర్గాల్లో ప్రయోగాలకు దూరంగా ఉండాలని జగన్ డిసైడ్ అయినట్లు తెలిసింది. పాత నేతలతో పాటు నియోజకవర్గాల్లో క్యాడర్ తో టచ్ లో ఉన్న నేతలకు అక్కడే టిక్కెట్లు ఇవ్వాలన్న యోచనలో ఉన్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. తన బొమ్మ పనిచేయదని భావించిన జగన్ నియోజకవర్గాల వారీగా ముందు నుంచే అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఎన్నికలకు మూడేళ్లకు ముందుగానే ప్రకటిస్తే జనంలోకి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయగలరన్న విశ్వాసంతో జగన్ ఉన్నారు. శింగనమల వంటి నియోజకవర్గాలు మాత్రమే కాకుండా గత ఎన్నికల్లో నియోజకవర్గాలు మారచిన వారిని కూడా వారి పాత స్థానాలకు పంపేయోచనలో జగన్ ఉన్నారని తెలిసింది.

# పహల్గాం దాడిని ఖండిస్తున్నాం..దోషులను వదలొద్దు..

- మొదటి పేజీ తరువాయి

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ క్రూరమైన దాడిలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం పట్ల పుతిన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు రష్యా పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ హేయమైన దాడికి పాల్పడిన వారితో పాటు, దాని వెనుక ఉన్న సూత్రధారులు, వారికి మద్దతునిచ్చిన వారిని కచ్చితంగా చట్టం ముందు నిలబెట్టి, శిక్షించాలని పుతిన్ నొక్కి చెప్పినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అమాయకుల మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ ఘోరమైన దాడికి పాల్పడిన వారిని, వారికి మద్దతిచ్చిన వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టాలని ఆయన అన్నారు" అని జైస్వాల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నేతలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనే నిబద్ధతను పునరుద్ఘాటించారు. రష్యా 'విజయోత్సవ దినోత్సవం' 80వ వార్షికోత్సవం సందర్భంగా పుతిన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది చివర్లో భారత్‌లో జరగనున్న వార్షిక శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాల్సిందిగా పుతిన్‌ను మోదీ ఆహ్వానించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.

కాగా, కశ్మీర్ దాడి దర్యాప్తులో రష్యా లేదా చైనా వంటి దేశాలు సానుకూల పాత్ర పోషించవచ్చని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కొద్ది రోజుల క్రితం వ్యాఖ్యానించిన నేపథ్యంలో పుతిన్ ఫోన్ కాల్ ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ ఆర్ఐఏ నోవోస్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ, "ఈ సంక్షోభంలో రష్యా, చైనా లేదా పాశ్చాత్య దేశాలు కూడా సానుకూల పాత్ర పోషించగలవని నేను భావిస్తున్నాను. భారత్, మోదీ అబద్ధం చెబుతున్నారా? లేక నిజం చెబుతున్నారా? అని తేల్చేందుకు వారు దర్యాప్తు బృందాన్ని కూడా ఏర్పాటు చేయవచ్చు. అంతర్జాతీయ బృందం నిజాన్ని కనుగొనాలి" అని అన్నారు.

అంతర్జాతీయ దర్యాప్తునకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా సుముఖంగా ఉన్నారని ఆసిఫ్ తెలిపారు. "ఈ ఘటనలో అసలు దోషులెవరో తేలాలి. పాకిస్థాన్ ప్రమేయం ఉందని లేదా పాక్ మద్దతు ఉందని చెప్పడానికి ఆధారాలుండాలి. ఇవి కేవలం ప్రకటనలు, తప్పుడు ఆరోపణలు తప్ప మరేమీ కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్, రష్యాల మధ్య దశాబ్దాలుగా బలమైన మైత్రి కొనసాగుతోంది. ముఖ్యంగా ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఉన్నప్పటికీ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంతో ఈ బంధం మరింత బలపడింది. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రధాని మోదీ, అధ్యక్షుడు పుతిన్ మధ్య వ్యక్తిగతంగా కూడా మంచి సాన్నిహిత్యం ఉంది. గతేడాది అక్టోబర్‌లో ప్రధాని రష్యా పర్యటన సందర్భంగా, "మన మధ్య అనుబంధం ఎంత బలమైనదంటే, ఎలాంటి అనువాదం లేకుండానే మీరు నన్ను అర్థం చేసుకోగలరు" అని పుతిన్ వ్యాఖ్యానించడం గమనార్హం.

# రాయలసీమ గడ్డ నా అడ్డా... ఖబడ్దార్

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలకు ఖబడ్దార్ అంటూ వార్నింగ్ ఇచ్చారు. తన పర్యటనలో భాగంగా హిందూపురం మండలం ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలను బాలకృష్ణ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు హిందూపురం రెండో పుట్టినిల్లు లాంటిదని గుర్తు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజలకు జవాబుదారీగా ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక దార్శనికత కలిగిన నాయకుడని కొనియాడారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తి కాకముందే హిందూపురంలో రూ. 50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేయించినట్లు బాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.136 కోట్లతో సమగ్ర నివేదికలు సిద్ధం చేశామని వెల్లడించారు. త్వరలోనే మున్సిపాలిటీ పరిధిలో అధునాతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

1984లోనే ఎన్టీఆర్ ముందుచూపుతో తూముకుంట వద్ద పారిశ్రామిక వాడను

ఏర్పాటు చేశారని, ఆ విషయాన్ని హిందూపురం ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. వీలైతే అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని... విమర్శలు చేయడం మానుకోవాలని వైసీపీకి హితవు పలికారు.

# పాకిస్థాన్‌కు నిధులు ఆపేయండి

- మొదటి పేజీ తరువాయి

భారత కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, పాకిస్థాన్‌కు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ని కోరింది. ఇటీవల జరిగిన ఒక సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని ఏడీబీ అధిపతి మసటో కండాతో నేరుగా ప్రస్తావించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్‌కు ఆర్థిక సహకారం కొనసాగించవద్దని ఆమె స్పష్టంగా విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ అంశంపై నిర్మలా సీతారామన్ ఇదివరకే ఇటలీ ఆర్థిక మంత్రితో చర్చలు జరిపారని, పలు ఇతర యూరోపియన్ దేశాలతో కూడా సంప్రదింపులు కొనసాగిస్తున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా, ఫైనాన్షియల్

యాక్షన్ టాస్క్‌ఫోర్స్ గ్రే లిస్ట్‌లో పాకిస్తాన్‌ను చేర్చేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. దీంతో పాటు, ఇస్లామాబాద్‌కు వివిధ బహుళపాక్షిక సంస్థల నుంచి అందుతున్న నిధుల ప్రవాహంపై సమీక్ష జరపాలని భారత్ అంతర్జాతీయ సమాజాన్ని కోరుతోంది. ఈ దౌత్యపరమైన చర్యల ద్వారా, ఉగ్రవాదానికి ఊతమిస్తోందనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌ను ఆర్థికంగా కట్టడి చేయాలనేది భారత్ ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.

# ఈ సమస్యపై భారత్, శ్రీలంక ప్రభుత్వాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- మొదటి పేజీ తరువాయి

ఈ తరహా ఘటనలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విషయంలో తక్షణం జోక్యం చేసుకోవాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరారు. ఇరు దేశాల ప్రభుత్వాలు నిర్మాణాత్మక చర్చలు జరిపి, మత్స్యకారుల భద్రతకు, గౌరవానికి భంగం కలగకుండా చూడాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ విమర్శించడం, ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలకు ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్ ఇవ్వడం తెలిసిందే.

**ఏపీకి అమరావతే ఏకైక, శాశ్వత రాజధాని**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతే ఏకైక, శాశ్వత రాజధానిగా నిలుస్తుందని పవన్ స్పష్టం చేశారు. ఇది కేవలం కాంక్రీట్ నిర్మాణాల సముదాయం కాదని, ప్రజాస్వామ్యానికి, జవాబుదారీతనానికి, న్యాయానికి ప్రతీకగా ఉంటుందని ఆయన అన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలను కొనియాడుతూ, గత ప్రభుత్వ హయాంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు సహకారంతో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. యువత ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వలస వెళ్లే అవసరం లేకుండా అమరావతే ఉపాధి అవకాశాల కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

గత ఐదేళ్లలో రాజధాని రైతులు తీవ్రంగా నష్టపోయారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. 29 వేలకు పైగా రైతులు 34 వేల ఎకరాలకు పైగా భూములను త్యాగం చేస్తే, గత ప్రభుత్వం వారి త్యాగాలను అవమానించిందని మండిపడ్డారు. రైతులు రోడ్లపైకి వచ్చి ముళ్ల కంచెల మధ్య ఆందోళనలు చేయాల్సి వచ్చిందని, లాఠీ దెబ్బలు తిని, కేసులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఎంతోమంది రైతులు ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆనాడు రైతులు పడ్డ కష్టాలను ప్రధాని దృష్టికి తీసుకెళతామని, అమరావతే రాజధానిగా ఉంటుందని తాను హామీ ఇచ్చానని, నేడు ఆ మాట నిలబెట్టుకుంటున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# 'బిగ్ బాస్' ఖరీదైన వ్యభిచారం, అందాల పోటీలతో అమ్మాయిలను ప్రదర్శన వస్తువులుగా మార్చడమే!

- మొదటి పేజీ తరువాయి

బిగ్‌బాస్ షో సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడని కార్యక్రమమని నారాయణ విమర్శించారు. ఇది యువతను తప్పుదారి పట్టిస్తోందని, కళారంగానికి సైతం కళంకం తెస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "బిగ్‌బాస్ వ్యవహారం చూస్తే.. చీప్ వ్యభిచారం వద్దు, కాస్ట్లీ వ్యభిచారం చేయండి అన్నట్టుంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. వివాహం కాని వారు ఒకే మంచం మీద పడుకోవడం వంటివి ప్రసారం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమాన్ని 24 గంటలు ప్రత్యక్ష ప్రసారం చేస్తే ఇంకా దారుణమైన దృశ్యాలు చూడాల్సి వచ్చేదని అన్నారు. బిగ్‌బాస్ షోను నిషేధించాలని తాను గత కొంతకాలంగా ప్రయత్నిస్తున్నానని నారాయణ తెలిపారు. ఈ విషయంలో పోలీసుల నుంచి జిల్లా కోర్టు వరకు సంప్రదించినా రెండేళ్లుగా తన పిటిషన్‌ను స్వీకరించలేదని, చివరికి హైకోర్టు స్పందించిందని చెప్పారు. తన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, బిగ్‌బాస్ నిర్వాహకులతో పాటు షో వ్యాఖ్యాత నాగార్జునకు కూడా నోటీసులు జారీ చేసిందని వెల్లడించారు. ప్రజలకు మేలు చేసేలా, ఈ కార్యక్రమాన్ని నిలిపివేస్తూ కోర్టు తీర్పు ఇస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన అందాల పోటీలపైనా నారాయణ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి పోటీలు మహిళలను కేవలం అందాల ప్రదర్శన వస్తువులుగా మార్చడమేనని ఆయన ఆరోపించారు. పనికిమాలిన వస్తువుల అమ్మకాల కోసం మహిళల అందాన్ని వాడుకుంటున్నారని అన్నారు. బిగ్‌బాస్ ఎంత హీనమైనదో, అందాల పోటీలు కూడా అంతేనని, ఈ రెండూ మహిళా జాతిని కించపరిచే కార్యక్రమాలని అభిప్రాయపడ్డారు. అందాల పోటీల వల్ల పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని చెప్పడం అవమానకరమని ఆయన విమర్శించారు.

భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు ప్రపంచానికే ఆదర్శమని, అలాంటిది బిగ్‌బాస్ వంటి కార్యక్రమాల నుంచి మనం నేర్చుకోవాల్సింది ఏమీ లేదని నారాయణ హితవు పలికారు. పవిత్రమైన భారతీయ సంస్కృతిని నాశనం చేయడానికే ఇలాంటివి పుట్టుకొస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## పాకిస్తాన్‌లో భూకంపం..

- మొదటి పేజీ తరువాయి

సంభవిస్తుండటం గమనార్హం. 2005లో పాకిస్తాన్?లో సంభవించిన భారీ భూకంపం కారణంగా 74 వేల మంది చనిపోయారు. అసలే.. పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాలతో పాకిస్తాన్ ప్రజలు యుద్ధ భయంతో వణికిపోతుంటే భూకంపం మరింతగా బెంబేలెత్తించింది.

ఇక.. యుద్ధం విషయానికొస్తే.. పాకిస్తాన్?కు ఇండియాతో యుద్ధం చేయాల్సి వస్తే.. ఆ దేశం వద్ద సరిపడా ఆయుధాల్లేవని తెలుస్తున్నది. కేవలం 4 రోజులకు సరిపడా శతఘ్ని గుండ్లు (యాంటీ -ఏయిర్‌క్రాఫ్ట్ గన్ అమ్మ్యునిషన్) మాత్రమే ఉన్నట్లు ఓ నేషనల్ మీడియా స్పష్టం చేసింది. ఇండియాతో పాకిస్తాన్ దీటుగా పోరాడలేదని, కొద్ది రోజుల్లోనే వెనుకడుగు వేసే పరిస్థితి ఉంటుందని తెలిపింది. పాకిస్తాన్ ఆర్మీకి కీలక ఆయుధాలు, బుల్లెట్లు సరఫరా చేయడంలో పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీస్ (పీవోఎఫ్) తీవ్రంగా విఫలమైంది. ప్రపంచవ్యాప్తంగా ఆయుధాలకు డిమాండ్ పెరగడమే దీనికి కారణమని తెలుస్తున్నది. దీనికి తోడు పీవోఎఫ్.. వద్ద ఆయుధాల తయారీకి సౌకర్యాల్లేవు. 15 ఎంఎం ఆర్టిలరీ షెల్స్?ను పాకిస్తాన్ ఇటీవల ఉక్రెయిన్?కు అమ్ముకోవడంతో తీవ్ర కొరత నెలకొన్నది. ఇప్పుడు ఉన్నవి కేవలం 96 గంటలకు మాత్రమే సరిపోతాయని ఓ నివేదిక వెల్లడించినట్లు తెలుస్తున్నది.

# వైసీపీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయి

- మొదటి పేజీ తరువాయి

కూటమి నేతల ప్రచార పిచ్చితో సింహాచలం ఆలయం వద్ద ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయని అన్నారు. ఈ మరణాలన్నీ ప్రభుత్వం హత్యలేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా జగన్ చూశారని బొత్స అన్నారు. చంద్రబాబు తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కూటమి 11 నెలల పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమని అన్నారు. రాష్ట్రానికి ఏం మేలు జరిగిందో ప్రజలు గమనించాలని చెప్పారు. మూడు టీవీ ఛానళ్లు, మూడు పేపర్లతో చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు.

# ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ

- మొదటి పేజీ తరువాయి

భారత్ తీసుకుంటున్న ప్రతిస్పందన చర్యలు, సైనిక సన్నద్ధతపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తాజా భద్రతా పరిస్థితి, ముఖ్యంగా పశ్చిమ సరిహద్దుల్లో సైనిక పరమైన ఏర్పాట్ల గురించి రక్షణ కార్యదర్శి ప్రధానికి వివరించినట్లు సమాచారం. ఒకేసారి బహుళ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే వ్యూహాలు, రక్షణ సరఫరాలకు అంతరాయం కలగకుండా చూసే చర్యలపై కూడా చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత వారం రోజులుగా ప్రధాని మోదీ త్రివిధ దళాధిపతులు, ఇతర ఉన్నతాధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

ఈ సమావేశం జరిగిన రోజే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి, పహల్గామ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జపాన్ రక్షణ మంత్రి జనరల్ నకతానితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఉగ్రవాదంతో సహా ప్రాంతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్‌కు సహకరిస్తామని జపాన్ పునరుద్ఘాటించింది.

ఇదిలావుండగా, నియంత్రణ రేఖవెంబడి పాకిస్తాన్ గత 11 రోజులుగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే ఉంది. గత రాత్రి కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ సహా పలు ప్రాంతాల్లో పాక్ దళాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డాయని భారత సైన్యం పేర్కొంది.

## భారత రక్షణ శాఖ వెబ్‌సైట్లపై

# పాకిస్థాన్ హ్యాకర్ల దాడి

- మొదటి పేజీ తరువాయి

రక్షణ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్ , మనోహర్ పారికర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ లకు చెందిన కీలక సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు 'పాకిస్తాన్ సైబర్ ఫోర్స్' అనే ఎక్స్ ఖాతా ప్రకటించింది. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్మర్డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్ వెబ్‌సైట్‌పై కూడా దాడికి యత్నించినట్లు సమాచారం. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఆ వెబ్‌సైట్‌ను ఆఫ్‌లైన్‌లో ఉంచి, జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి అధికారులు పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహిస్తున్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత హ్యాకర్ల నుంచి మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని భావిస్తున్న సైబర్ సెక్యూరిటీ నిపుణులు నిఘా ఉంచారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులను అడ్డుకునేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను పటిష్టం చేస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో నిలిపివేయబడిన 'పాకిస్తాన్ సైబర్ ఫోర్స్' ఖాతా గతంలో ఆర్మర్డ్ వెహికిల్ నిగమ్ లిమిటెడ్ వెబ్ పేజీ చిత్రాన్ని పోస్ట్ చేసింది. అందులో భారత ట్యాంక్ స్థానంలో పాకిస్తాన్ ట్యాంక్‌ను మార్ఫింగ్ చేసినట్లు కనిపించింది. మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్ డేటాను హ్యాక్ చేశామని, మీ భద్రత ఓ భ్రమ అని పేర్కొంటూ కొందరు రక్షణ సిబ్బంది పేర్లతో మరో పోస్ట్ చేసింది. ఐడీఎస్ఏ వెబ్‌సైట్ నుంచి 1,600 మంది యూజర్లకు చెందిన 10 జీబీకి పైగా డేటాను సేకరించినట్లు కూడా ఈ హ్యాకర్ల బృందం ప్రకటించింది.

## శ్రీకోనేటి రాయస్వామి ఆలయంలో ధ్వజారోహణం





**పలమనేరు మే 4, (పెన్ పవర్) :** నియోజకవర్గ పరిధిలోని గంగవరం మండలంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయ స్వామి ఆలయం నందు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మధ్యాహ్నం ధ్వజారహణం నిర్వహించారు.ఈ సందర్భంగా యాగశాలలో పూజలు నిర్వహించి ధ్వజపటాన్ని,చక్రతాల్వారిని,శ్రీదేవి భూదేవి సమేత కోనేటిరాయ స్వామివారిని తిరిచ్చి వాహనంపై కొలువు తీర్చి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.ఈ ధ్వజారోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలకు ఆహ్వానం పలికారు.ఖాద్రి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమన శాస్త్ర ప్రకారం ధ్వజారోహణం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే సాయంత్రం ఆలయంలో ఊంజల్ సేవ అనంతరం పెద్ద శేషవాహనం కొలువుల దీరిన శ్రీదేవిభూదేవి సమేత కోనేటిరాయ స్వామిని గ్రామంలోని నాలుగు మాదవీధుల్లో ఊరేగించారు.భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామివారిని పూజించి తమ మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి,సూపరింటెండెంట్ రాజకుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ గజేంద్రతో పాటు భక్తాదులు పాల్గొన్నారు.


# పెన్ పవర్

## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా


# దీర్ఘకాల అపరిష్కృత భూ సమస్యలకు పరిష్కారం

## డి నోటిఫై పత్రాలను రైతులకు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ మే 05 :** చుక్కల భూములు, 22 ఏ1 భూములు నిషేధిత జాబితాలో వుండి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 11 మంది రైతులకు డీనోటిఫై చేసిన క్లియరెన్స్ పత్రాలను అందజేసామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి సంబంధిత డి నోటిఫై పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూసమస్యలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించి నిషేధిత జాబితా నుండి 11 మంది రైతులకు 32.71 ఎకరాల విస్తీర్ణం గల డి నోటిఫై పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భూ నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, 22 ఎ1 భూములు గత ఐదారు సంవత్సరాల నుండి వివిధ సమస్యలతో పెండింగ్లో ఉండి పరిష్కారం కానీ సమస్యలను సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపామన్నారు. ఇందుకు సంబంధించి సంబంధిత తహశీల్దార్లు, ఆర్డీఓలు, సెక్షన్స్ సిబ్బంది త్వరితగతిన భూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. బాధిత సర్వే నంబర్ల రైతులను ఐజిఆర్ఎస్ నిషేధిత జాబితాలో డీనోటిఫై చేయాలని సంబంధిత రిజిస్ట్రార్ లను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా వెబ్ ల్యాండ్ పోర్టల్ లో అప్డేట్ చేయడంతో పాటు డీనోటిఫై పత్రాలు ఇచ్చిన నిషేధిత భూముల నుండి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు. దీర్ఘకాలిక భూ సమస్య బాధితులైన 11 మందికి కలెక్టర్ డి నోటిఫై పత్రాలను అందజేశారు. అందులో సిరివెళ్ల మండలం, సిరివెళ్ల గ్రామ నివాసి నాయక్ నజీర్, S/O.నబీ సాహెబ్, సర్వే నంబరు.143 లో 4.27 ఎకరాలు, సిరివెళ్ల మండలం, బోయలకుంట గ్రామ నివాసి కంచర్ల వీరారెడ్డి, సర్వే నంబరు.506 లో 1.48 ఎకరాలు, నంద్యాల అర్బన్ మండలం, మూలసాగరం గ్రామ నివాసి ఎన్.రవికాంత్ రెడ్డి, సర్వే నంబరు.684-బి1ఎలో 0.25 ఎకరాలు, సర్వే నంబరు.687-2ఎలో 0.22 ఎకరాలు, రుద్రవరం మండలం, ఎర్రగుడిదిన్నె గ్రామ నివాసి ఆలమూరు పెద్దకేశవులు, ఆలమూరు చిన్నకేశవులు S/O.చెన్నయ్య, సర్వే నంబరు.489-3లో 2 ఎకరాలు, సర్వే నంబరు.489-4లో 0.21 ఎకరాలు, నంద్యాల రూరల్, చాపిరేవుల గ్రామ నివాసి ఎర్రబోలు బ్రహ్మేశ్వర రెడ్డి, సర్వే నంబరు.183/1ఎలో 0.67 ఎకరాలు, ఆళ్లగడ్డ మండలం, పి.చింతకుంట్ల గ్రామ నివాసి ఈడిగ పెద్ద నరసింహుడు, %o/శీ%.ఈ.చిన్న నరసింహుడు, సర్వే నంబరు.501/ఎలో 2.44 ఎకరాలు, కొలిమిగుండ్ల మండలం, తొల్లమడుగు భానుముక్కల గ్రామ నివాసి మొలకల గోపాల్ రెడ్డి, మొలకల లక్ష్మీదేవి, సర్వే నంబరు.619/1 లో 2.11 ఎకరాలు, బనగానపల్లె మండలం, కృష్ణగిరి గ్రామ నివాసి చింతమాను మద్దిలేటి, సర్వే నంబరు.163లో 1.51 ఎకరాలు, బనగానపల్లె మండలం, కృష్ణగిరి గ్రామ నివాసి ఈడిగ సుబ్బమ్మ, సర్వే నంబరు.17లో 6.50 ఎకరాలు, బనగానపల్లె మండలం, బనగానపల్లె గ్రామ నివాసి కె.గుర్రెడ్డి, S/O.లేట్ గురెడ్డి, నాగ పినాకిని రెడ్డి, %o/శీ%.లేట్ నాగేశ్వర రెడ్డి, సర్వే నంబరు.153-1ఎలో 2.50 ఎకరాలు, మిద్తూరు మండలం, రోళ్లపాడు గ్రామ నివాసి బిడుగు S/O.మున్నయ్య, సర్వే నంబరు.618/1లో 8.55 ఎకరాలకు డి నోటిఫై ఉత్తర్వుల పత్రాలను సంబంధిత బాధిత రైతులకు కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ సంతోషాన్ని, భావోద్వేగంతో వెలిబుచ్చుతూ కలెక్టర్ కు కృత్ఞతలు తెలిపారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభం

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ



**నంద్యాల, పెన్ పవర్ మే 05 :** నంద్యాల పట్టణంలోని కేసి కెనాల్ కాంపౌండ్ లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయ భవనంలో అత్యాధునిక వసతులతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ను మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో ఎంతో మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు చికిత్స కోసం రావడం జరుగుతుందని. రక్తం దొరకక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, గౌరవ జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి నేతృత్వంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి సమాజానికి అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమన్నారు. రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొక ప్రాణం కాపాడేందుకు తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా విభజన తర్వాత నంద్యాలలో బ్లడ్ బ్యాంక్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏదైనా అపాయకర పరిస్థితిలో రోగులకు బ్లడ్ కావాలంటే కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఇక్కడి నుండే సరఫరా చేయవచ్చన్నారు. స్థానికంగా బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ద్వారా నంద్యాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సకల సదుపాయాలతో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. గతంలో బనగానపల్లెలో బ్లడ్ బ్యాంక్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరితే రెడ్ క్రాస్ సంస్థ సానుకూలంగా స్పందించిందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో రక్తం అవసరం ఉన్న వారికి సరైన సమయంలో అందించడానికి ఇతర జిల్లాలోని రక్తనిల్వ కేంద్రాల మీద ఆధార పడకుండా మన జిల్లాలోనే రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో రెడ్ క్రాస్ సంస్థ వారి సహకారంతో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక సబ్ యూనిట్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. ప్రజలు అందరూ రక్త నిల్వ కేంద్రం యొక్క సేవలను సద్వినియోగం తరువాయి 4లో..

## గ్రూప్ వన్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు





**తిరుపతి/పెన్ పవర్/ మే 05 :** తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు లోని న్యూ బాలాజీ కాలనీ నందు గల SDHR కళాశాలను మరియు ఎస్.వి.యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కాలేజీ కాలేజీ గల గ్రూప్ వన్ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పి వి. హర్షవర్ధన్ రాజు సందర్శించారు. గ్రూప్ పరిక్ష కేంద్రలను పరిశీలించి, పరీక్ష జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రల వద్ద ఎర్పాట్లను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. పరీక్షలు వ్రాస్తున్న అభ్యర్థులకు కనీసం అవసరాలు సక్రమంగా ఎర్పాటు చేయాలని ఆదేశచారు. పరీక్ష అయ్యే అంతవరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## ప్రధాన ఆసుపత్రి తనిఖీ చేసిన జోనల్ ఇంచార్జ్ ఆఫీసర్ ఎం.టి.కృష్ణ బాబు







**చిత్తూరు పెన్ పవర్ మే 5 :** సోమవారం సాయంత్రం రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇంచార్జ్ ఆఫీసర్ ఎం.టి. కృష్ణ బాబు చిత్తూరు జిల్లా ఒకరోజు పర్యటనలో భాగంగా చిత్తూరు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆకస్మిక తనిఖీలో భాగంగా హాస్పిటల్ లోని వివిధ వార్డులను రక్త నిధి కేంద్రం పరిశీలించారు. ఏరియా ఆసుపత్రి నందు వైద్య విధాన పరిషత్ మరియు అపోలో వారి ద్వారా అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏరియా ఆసుపత్రిలో మంది వివిధ విభాగాలలో పనిచేస్తున్న వారి వివరాలను మెడికల్ సూపరింటెండెంట్ ఉష శ్రీ వివరించారు. అపోలో వారు అందిస్తున్న వైద్య సేవలు గురించి అపోలో మేనేజర్ నరేష్ వివరించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, డిఎం& హెచ్ ఓ డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ పద్మాంజలి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి

### - 9న అనంతపురం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
### - రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**అనంతపురం, పెన్ పవర్ మే 05 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఈనెల 9వ తేదీన అనంతపురం జిల్లాలో ఉంటుందని రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో ఉరవకొండ పట్టణం చిన్నముష్టూరు గ్రామం పరిధిలో మరియు వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్దనున్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధానంగా హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచుతూ వెడల్పు చేసే పనులను అన్నింటిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒకసారి పరిశీలిస్తారన్నారు. ఇప్పటిదాకా హంద్రీనీవాకు బడ్జెట్ కేటాయింపులు చేశామని, కాలువ వెడల్పు పనులు ప్రారంభమయ్యాయని, దాదాపు ఇప్పటికే 50, 60 శాతం పనులు పురోగతిలో కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చి ఎప్పటిలోపు పనులు పూర్తి చేయాలి, అనుకున్న ప్రణాళిక ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అనేది పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటన కోసం సీఎం వస్తున్నారన్నారు. అనంతపురం జిల్లా పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉన్న ప్రత్యేక శ్రద్ధ ఈరోజు కళ్ళ ముందు కనిపిస్తోందన్నారు. ప్రభుత్వంలోకి వచ్చిన సంవత్సరంలోపే ఈ జిల్లాకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న హంద్రీనీవా కాలువ వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా పనులను శరవేగంగా పరుగులు పెట్టించడం, ఆ పనులు కూడా జూలై 10వ తేదీలోపు పూర్తి కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి గడువు పెట్టడం జరిగిందన్నారు. ఇప్పుడు వస్తున్న నీటికి రెట్టింపు తీసుకొచ్చే విధంగా హంద్రీనీవా కాలవను తయారు చేస్తున్నామన్నారు. ఎక్కడ స్ట్రక్చర్ లు కట్టకుండా చిన్న చిన్న పిల్లకాలువలు తవ్వి కేవలం ఒక పంపుతో పనులు గతంలో హడావిడిగా చేస్తే 2014 - 19 మధ్యలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉమామహేశ్వరరావు ఉన్నప్పుడు మొట్టమొదటిసారి తీసుకువచ్చి ఎక్కడెక్కడ ఎంత ఖర్చు పెట్టాలి, ఏం వెడల్పు చేయాలి అనేది చూసి ఒక పంపుతో నడిచే దాన్ని ఆరు పంపులకు తీసుకెళ్లిన ఘనత కూడా మాకే దక్కుతుందన్నారు. ఇవాళ ఆరు పంపులను 12 పంపులకు తీసుకెళ్లాలని అనుకుంటున్నామని, 12 పంపులు తరువాయి 4లో..

## కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు : ప్రాజెక్టు డైరెక్టర్



**గుడిపల్లి, పెన్ పవర్ మే 05 :** పుట్టుక నుండి మరణించే వరకు ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిరక్షణను రాష్ట్ర ప్రభుత్వం తన భాధ్యతగా తీసుకున్నదని రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇంచార్జ్ ఆఫీసర్ ఎం.టి.కృష్ణ బాబు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇంచార్జ్ ఆఫీసర్ ఎం.టి.కృష్ణ బాబు చిత్తూరు జిల్లా ఒకరోజు పర్యటనలో భాగంగా ఆ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడ పిడి వికాస్ మర్మత్‌తో కలసి కుప్పం నియోజకవర్గంలో ఏరియా ఆస్పత్రి, గుడిపల్లి మండలం కనమలపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ ను ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం ప్రజలతో సమావేశమై వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అందుతున్న విస్తృత సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం నుండి ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చూట్టారని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో పుట్టుక నుండి మరణించే వరకు ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిరక్షణను రాష్ట్ర ప్రభుత్వం తన భాధ్యతగా తీసుకున్నదన్నారు. ఏఎన్ఎం లు నర్స్ ల ద్వారా ఎన్సీడి సర్వే చేసి బి పి, షుగర్, రక్త హీనత వంటి పలు అంశాల పై పరీక్షలు నిర్వహించి ప్రజల ఆరోగ్యానికి సంబంధించి సమాచారం సేకరించామన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిస్థితి పై టాటా సంస్థ ద్వారా సర్వే చేసి సమాచారంను భద్రపరచడం జరిగిందని, ఈ సమాచారం భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను తరువాయి 4లో..

## అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

### – జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్




**కడప, పెన్ పవర్ మే 5 :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని.. కడప పట్టణం పాలెం పల్లె కు చెందిన సి. వెంకట సుబ్బమ్మ వితంతు పింఛను పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్తించారు. దువ్వూరు మండలం, కానగూడూరు కు చెందిన పి. ఖాసీంబూ తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నీటి కనెక్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు. తొండూరు మండల కేంద్రానికి చెందిన వి. శివ నారాయణ రెడ్డి సర్వే నెం. 347/ఏ లో ఓ.18 సెంట్ల స్థలం ను పట్టాదారు పుస్తకం లో ఎక్కించవలసిందిగా అభ్యర్తించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జడ్పి సీఈవో ఓబులమ్మ, మెప్మా పిడి కిరణ్, ఎస్ డీసీ శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు



**కడప పెన్ పవర్ మే 5 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప గౌరవ డాక్టర్ సి.యామిని మరియు శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాల సందర్భంగా కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు పారిశ్రామిక కార్మికులు, వలస కార్మికులు మరియు అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, ఈ-శ్రమ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి, అసంఘటిత కార్మికుల/వ్యవసాయ కార్మికుల యొక్క సమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయము, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మనోహర్ మరియు ప్రవీణ్ కుమార్, పారా లీగల్ వాలంటరీ దశరథ రామిరెడ్డి, పారిశ్రామిక కార్మికులు, వలస కార్మికులు మరియు అసంఘటిత కార్మికులకు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయి అభివృద్ధి కమిటీ : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ మే 06 :** మే 06న మంగళ వారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో ఉ.10 గం.లకు జిల్లా స్థాయి అభివృద్ధి పై సమీక్షా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, చిత్తూరు ఎంపి, జిల్లాలోని శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ సంస్థలు, విద్య, వైద్య, డిఆర్‌డిఏ, డ్వామా, జెడ్పి, హౌసింగ్, పంచాయతీరాజ్, పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సాధించిన పురోగతి పై సమీక్షించడం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ సమీక్షకు హాజరు కావాలని ఆదేశించారు.

## మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించిన శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి పెన్ పవర్ మే 05 :** తిరుపతి నియోజకవర్గం లో జరగబోయే మెగా జాబ్ మేళా పోస్టర్లను స్థానిక శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు సంబంధిత అధికారులతో కలసి మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో 08-05-2025 తేదీన అనగా గురువారం ఉదయం 8 గంటల నుంచి తిరుపతిలోని గీతం స్కూల్, భవాని నగర్ సర్కిల్, నందు జరగబోయే మెగా జాబ్ మేళా కొరకు ఈరోజు ముఖ్య అతిదిగా పాల్గొని ఆరణి శ్రీనివాసులు శాసనసభ్యులు, తిరుపతి వారు మెగాజాబ్ మేళా పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్బంగా స్థానిక శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ చదువుకుని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ యువత కోసం,శ్రీ సిటీ, మేనకూరు సెజ్ , ఈఎంసి క్లస్టర్, తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్, మరియు చెన్నైలోని 16 బహుళ జాతీయ కంపెనీలలో 700 పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడునని కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా లేదా ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత అయిన నిరుద్యోగ యువతి యువకులు ఈ మెగాజాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు క్రింద తెలుపబడిన రిజిస్ట్రేషన్ లింక్ లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. మరిన్ని వివరాలకు క్రింద తెలుపబడిన మొబైల్ నెంబర్లను సంప్రదించగలరు.

రిజిస్ట్రేషన్ లింకు : https://naipunyam.ap.gov.in/user-registration. రిజిస్ట్రేషన్ కోసం చివరి తేదీ 07-05-2025. మరియు స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా కలదు. ఇతర వివరములు కొరకు సంప్రదించండి: 8143576866,9177508279, 9988853335.(కాల్ సెంటర్)

**గమనిక:** మెగా జాబ్ మేళాకు( ఇంటర్వ్యూలకు) హాజరయ్యా యువతి యువకులు పైన ఇచ్చిన రిజిస్ట్రేషన్ లింకులో ఆధార్ ఓటిపితో ట్రైనీ రిజిస్ట్రేషన్ చేసుకొని మరియు మీ ప్రొఫైల్ లాగిన్ అయ్యి అన్ని కంపెనీలకు అప్లై చేసుకుని అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. లోకనాథం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, శ్రీ. రమణ, అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్వీయూ, తిరుపతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఏ సురేష్, ఎన్‌టిఓ ఏ. గణేష్ జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్,ఏపీ ఎస్ఎస్‌డిసి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌తో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే భేటీ



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, మే 5 :** కలెక్టరేట్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కలెక్టర్ వెంకటేశ్వర్తో సోమవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గంలో చేపట్ట వలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల గురించి కలెక్టర్తో చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభం













**(3వ పేజీ తరువాయి)** చేసుకోవాలన్నారు. అదే విధంగా రెడ్ క్రాస్ సైన్యాన్ని ఒకటి తయారు చేసి యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్ గా ఏర్పడి జిల్లాకు ఏ విపత్తు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా కూడా సమాయత్తం చేస్తున్నామన్నారు. అదే విధంగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన జిల్లా మంత్రులకు కలెక్టర్ జిల్లా యంత్రాగం తరపున కృత్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, డిఇఓ జనార్దన్ రెడ్డి, హాస్పిటల్ సూపరిన్టెంట్ డాక్టర్ మల్లీశ్వరి, డీసీ హెచ్ ఎస్ డాక్టర్ జఫ్రుల్ల, సెట్కూర్ సిఇఓ డాక్టర్ వేణుగోపాల్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఖలందర్, రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, సెక్రటరీ వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వరరావ్, జాయింట్ సెక్రటరీ మమతా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటి సభ్యులు ఉస్మాన్ బాషా, నాగ శేషయ్య, మద్దిలేటి, నాగరాజు, చైతన్య, యాకూబ్, సురేంద్ర, రెడ్ క్రాస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి

**(3వ పేజీ తరువాయి)** పనిచేసే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామన్నారు. హంద్రీనీవా కాలవ వెడల్పు పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కోసం నాలుగైదు స్థలాలను చూసామని, రాగులపాడు, లత్తవరం, ఛాయాపురం గ్రామాలను పరిశీలిస్తున్నామని, ఎక్కడ పనులు జరుగుతుంటే అక్కడ ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉంటుందని, ఏ గ్రామంవద్ద అయితే పనులు జరుగుతున్నాయో ఆ గ్రామంలో గ్రామ సభ జరుగుతుందన్నారు. ఆ గ్రామసభలో కేవలం గ్రామస్తులు మాత్రమే పాల్గొంటారని, ఆ గ్రామంలోని మహిళలు, యువకులు, రైతులతో ప్రత్యేకంగా మాట్లాడడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమానికి చాలా తక్కువ సమయం ఉందని, భారతదేశంలో ప్రతిష్టాత్మకంగా హిందూ పేపర్ వారు బెంగళూరులో ఒక కాంక్లేవ్ ఏర్పాటు చేశారని, మధ్యాహ్నం 02:30 గంటల నుంచి ఆ కాంక్లేవ్ మొదలవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఈనెల 9వ తేదీన 11 గంటల నుంచి 1 గంట వరకు కేవలం రెండు గంటలు మాత్రమే కొనసాగే పరిస్థితి ఉంటుందన్నారు. వస్తూ వస్తూ ఏరియల్ వ్యూ లోనే కాలువ పనులను సీఎం చూసుకుంటూ రావడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో కూడా మళ్లీ ఇక్కడ జరుగుతున్న పనులన్నీ చూసిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్యాహ్నం 1 గంటకు తిరిగి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలను కార్యక్రమం ఫైనలైజ్ అయిన తర్వాత తెలియజేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అంతకుముందు ఉరవకొండ పట్టణం మరియు చిన్నముష్టూరు గ్రామం పరిధిలోని 192 కిలోమీటర్ వద్ద కాలువ వెడల్పు పనులను మంత్రి పరిశీలించారు. మిషనరీ పనులు ఎక్కడెక్కడ జరుగుతున్నాయి అంటూ అధికారులతో మంత్రి ఆరా తీశారు. కాలువ వెడల్పు చేస్తే ఎలా ఉంటుందో తెలిసేలా పనులు చేపట్టాలని, పనులు చేయకముందు ఎలా ఉంటుంది, చేసిన తర్వాత ఎలా ఉంటుంది అనేది తెలిపేలా పనులు ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్దనున్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలిసి మంత్రి పరిశీలించారు. కాలువ వెడల్పు పనులను, హెలిప్యాడ్ ఏర్పాటు, గ్రామసభ నిర్వహించేందుకు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద స్థలాన్ని మంత్రి పరిశీలించారు. తదనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీలు గ్రామంలో పర్యటించి పలు స్థలాలను, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, హెచ్ఎన్ఎస్ఎస్ సిఈ నాగరాజు, ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఆర్డీఓ ఎస్ఆర్బీఎస్ శ్రీనివాస్, ఆర్&బి ఎస్ఈ రాజగోపాల్, డిఈ కాటమయ్య, తహసీల్దార్లు మహబూబ్ భాష, నరేష్, ఏపీఐడిసి మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఆయా శాఖల అధికారులు, సిఐలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు : ప్రాజెక్టు డైరెక్టర్



**(3వ పేజీ తరువాయి)** సకాలంలో అందించడానికి తోడ్పడతాయన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో దాదాపు 3 లక్షల జనాభా ఉందని, వీరి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం టాటా సంస్థ ద్వారా సర్వే చేసి సేకరించిన సమాచారాన్ని డిజిటలైజ్ చేయడం జరిగిందని, ఈ ప్రక్రియ ద్వారా ప్రజల ఆరోగ్యస్థితిలను ఎప్పుడైనా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పి హెచ్ సి, ఏరియా ఆసుపత్రిలలో మెరుగైన అవసరం కోసం ఈ సమాచారం ఉపయోగపడుతుందని అన్నారు. 25 మంది సిబ్బందితో కాల్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, కాల్ సెంటర్ లను సంప్రదించి కూడా వైద్య సలహాలు పొందవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానం ద్వారా వైద్య చికిత్సలు మెరుగుపడి ప్రజల ఆరోగ్యం విషయంలో ఘనమైన మార్పులు వస్తాయని అన్నారు. వేసవి కాలం లో భూగర్భ జల మట్టం అడుగంటిందని, త్వరలో కుప్పం నియోజకవర్గానికి హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా నీరు అందించే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నదని తెలిపారు.

హెచ్ ఎన్ ఎస్ ఎస్ నీటి ద్వారా నరేగా, నీటి పారుదల శాఖ ద్వారా గుర్తించిన చెరువులను నీటి తో నింపు భూగర్భ జల నీటి మట్టం పెంచడానికి చర్యలు చేపడతామన్నారు. కడ పిడి మాట్లాడుతూ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కుప్పం ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందిస్తామన్నారు. వైద్య సేవలలో లోటు పాట్లు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. టాటా సంస్థ వారిచే కుప్పం నియోజకవర్గ పజల ఆరోగ్య స్థితి గతుల పై సర్వే చేపట్టామన్నారు. కుప్పం నియోజకవర్గం ను దేశం లోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశం లో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, డిఎం& హెచ్ ఓ డాక్టర్ సుధారాణి, సంబంధిత జిల్లా అధికారులు తహసిల్దార్ సీతారాం, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు,మహిళలు పాల్గొన్నారు.

# కార్మికుల ఊపిరి కార్ల్ మార్క్స్ : సిపిఎం



**శ్రీకాళహస్తి , పెన్ పవర్, ప్రతినిధి, మే 5 :** ప్రపంచ కార్మికుల ఊపిరి, కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్ అని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం కార్ల్ మార్క్స్ 207వ జయంతిని నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్మిక వర్గాన్ని దోపిడీ నుంచి విముక్తి చేసే గొప్ప సిద్ధాంతాన్ని మార్క్స్ రూపొందించారని పుల్లయ్య తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో నిరుద్యోగం, పేదరికం రోజురోజుకు తీవ్రమవుతున్నాయని చెప్పారు. ఒక మనిషిని ఇంకొక మనిషి దోపిడీ చేసే వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని కార్ల్ మార్క్స్ ఉధృతం చేశారని కొనియాడారు. సమాజంలో అందరికీ తిండి, ఇల్లు, బట్ట లాంటి కనీస సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, దానికి అనుగుణంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారన్నారని గుర్తు చేశారు. సమాజంలో ధనిక, పేదల మధ్య అంతరాలు తగ్గించేందుకు మార్క్సిజం కీలకంగా ఉపయోగపడుతుందని అన్నారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, రాపూరు సుబ్రమణ్యం, రాధమ్మ, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్స్‌కు ఈ శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు





**కర్నూలు పెన్ పవర్ మే 5 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు గౌరవ జి. కబర్ధి వారి సూచనల మేరకు బి. లీలా వెంకట శేషాద్రి,కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్ సోమవారం నాడు న్యాయ సేవా సదన్ నందు ఆశ వర్కర్స్‌కు ఈ శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి ఈ శ్రామ్ కార్డులు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ శ్రామ్ కార్డుల వల్ల లభించే ఉపయోగాలను మీకు తెలిసిన కార్మికులకు తెలియజేసి వారు ఈ శ్రామ్ కార్డులు పొందేలా కృషి చేయాలని కోరారు.జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ శాంతి కళ గారు మాట్టాడుతూ తమ డిపార్ట్మెంట్ లోని అందరు ఆశ వర్కర్స్ ఈ శ్రామ్ కార్డ్స్ పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గారు ఆశ వర్కర్స్ కు ఈ శ్రామ్ కార్డులు ఈ శ్రామ్ పోర్టర్ లో ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ కార్డులు పొందిన వారికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రతా పథకాలు వివిధ సంక్షేమ పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. మరియు ప్రతి ఒక్క కార్మికునికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రెండు లక్షల ప్రమాద మరణ బీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో హెల్త్ డిపార్ట్మెంట్ లీగల్ ఆఫీసర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

## కాలువ వెడల్పు పనులు పరిశీలన







**అనంతపురం పెన్ పవర్ మే 5 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ఉరవకొండ పట్టణం మరియు చిన్నముష్టూరు గ్రామం పరిధిలో ఉన్న హెచ్ ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,తో కలిసి సమగ్రంగా పరిశీలించిన రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్.

## డ్రైనేజీపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి శ్రీనివాసులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ , ప్రతినిధి, మే 5 :** శ్రీకాళహస్తి వీధుల్లో డ్రైనేజీ కాలవలు చెత్తతో నిండిపోవడంతో నీరు వీధుల్లోకి వస్తోందని మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది కొరతను కారణంగా చూపుతూ శుభ్రపరిచే పనులు నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ స్వయంగా వచ్చి పరిస్థితిని పరిశీలించి, స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## మండలంలో పెద్దపులి తిరుగుతుంది 'ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దు': డిఆర్ఓ ప్రసాద్ రెడ్డి



**అర్ధవుడు, పెన్ పవర్ , మే 5 :** అర్ధవీడు మండలంలో పెద్దపులి తిరుగుతుందని ఒంటరిగా అడవిలోకి వెళ్లొద్దని డిఆర్ ఓ ప్రసాద్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 5 నుంచి ఉదయం 7 గంటల వరకు అడవికి వెళ్లొద్దని హెచ్చరించారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఒంటరిగా వెళ్లొద్దని మార్కాపురం డిప్యూటీ రేంజర్ ప్రసాద్ రెడ్డి ప్రజలను హెచ్చరించారు. అర్ధవీడు మండలంలో పెద్దపులి సంచరిస్తూ, పశువులను చంపుతుండటంతో ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. ఇటీవల మండలంలోని కొత్తూరు, అయ్యవారిపల్లె గ్రామ సమీపంలో తిరిగిందని తెలిపారు. సాయంత్రం 5 నుంచి ఉదయం 7 గంటల వరకు అటవీ ప్రాంతానికి వెళ్లకూడదని ఆయన స్పష్టం చేశారు.

# టీటీడీ చైర్మన్‌కు ఆహ్వానం



**తిరుపతి/ పెన్ పవర్/ మే 05 :** తిరుపతి గంగమ్మ జాతరకు హాజరు కావాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ను తాతయ్య గుంట గంగమ్మ జాతరకు ఆహ్వానం పలికారు. ఆలయ ఈవో జయకుమార్, అర్చకులు రామకృష్ణ శర్మ గంగమ్మ ప్రసాదాలను అందజేశారు. టీటీడీ తరపున ఆలయానికి రావాల్సిన వాటిపై చర్చించారు.

## గాలివాన భీభత్సం...విరిగిపోయిన స్థంబాలు



**కొనకనమిట్ల పెన్ పవర్ మే 5 :** కొనకనమిట్ల మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా గాలివాన భీభత్సం సృష్టించాయి.గ్రామంలో కరెంట్ స్థంబాలు,చెట్లు నేలకొరిగాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో కరెంట్ స్థంబాలు విరిగిపడ్డాయి.విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై గ్రామంలో కరెంట్ సరఫరా నిలిపివేశారు.ఉదయం నుండి ఎండ వేడితో ఇబ్బంది పడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం కలిగిందని తెలియచేసారు.విరిగిపోయిన విద్యుత్ స్థంబాలను తొలగించి పునరుద్ధరించే పనిలో విద్యుత్ శాఖ అధికారులు ఉన్నారు.

## విద్యారంగాన్ని కాపాడుకోవడమే లక్ష్యం

**- ఏపిటిఎఫ్ రాష్ట్ర బాధ్యురాలు చెన్నుపాటి మంజుల**




**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మే 05 :** విద్యారంగాన్ని కాపాడుకోవడమే ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ లక్ష్యం అని రాష్ట్ర బాధ్యురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం పాఠశాలల విద్యా విధానంపై ప్రభుత్వ వైఖరి ఖండిస్తూ ఏపీటి ఎఫ్ ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణం నందు జిల్లా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సంఘ ఉపాధ్యాయులు పాల్గొని తమ నిరశనను తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాధ్యురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మూడంచెల నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇవ్వడం జరిగిందని అన్నారు. అందులో భాగంగా నేడు రాష్ట్రంలోని అన్ని తాలూకా యూనిట్లు వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక పాఠశాల 1 నుండి 5వ తరగతిలో మోడల్ ప్రాథమిక పాఠశాలలైన బేసిక్ ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలని అన్నారు. ఇప్పటికే ఉనికిలో ఉన్న ఆరు నుండి పదో తరగతి 12వ తరగతి పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానించాలని, 12వ పిఆర్సి కమిషన్ వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు తిరుమల, జోనల్ కన్వీనర్ బి.శేషారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పని ముట్లు పంపిణీ

**గిద్దలూరు పెన్ పవర్ మే 5 :** గిద్దలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, ప్రాంగణంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, చే సబ్సిడీ పై వ్యక్తిగత వ్యవసాయ యంత్రపరికరాలు, పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు, మాట్లాడుతూ రైతులకు కావలసిన వ్యవసాయ యంత్ర పరికరాలైన 9 చెక్కలు/11 చెక్కలు గొర్రులు, రోటవేటర్లు, విత్తనం గొర్రెలు, తైవాన్ స్ప్రేయర్లు మొదలైనవి సబ్సిడీ మీద మొత్తం 296 మందికి మంజూరు జరిగిందని తెలియజేస్తూ, రైతులు వీటిని ఉపయోగించుకొని వ్యవసాయంలో ఇంకా ముందుకు వెళ్లాలని రైతు సోదరులను ఉద్దేశించి మాట్లాడారు. అదేవిధంగా రసాయనక ఎరువులు వలన రోజురోజుకు భూములు నిస్సరమవుతున్నాయి కావున 50శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట ఎరువులు జిలుగులు, జనుములు, పిలిపిసర్లు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నారు. వాటిని రైతులందరూ సద్వినియోగపరుచుకొని రానున్న కాలంలో భూములు మరింత సారవంతంగా చేసుకోగలరని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గిద్దలూరు , కంభం బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు గిద్దలూరు డి.బాలాజీ నాయక్, ఆరు మండలాల వ్యవసాయాధికారులు విజయ భాస్కర్ రెడ్డి, రఫీక్, రాజశ్రీ, మెర్సీ, స్వరూప మొహమ్మద్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్లు, బోర్డు డైరెక్టర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

# బనగానపల్లెలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు : మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి





**నంద్యాల, పెన్ పవర్ మే 05 :** బనగానపల్లె పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు ప్రతి ఒక్కరికి 2 సెంట్ల ఇళ్ల పట్టాలు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిరుపేదల ఇళ్ల పట్టాల అంశంపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డోన్ ఆర్డీవో నరసింహులు నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, బనగానపల్లె మండల తాసిల్దారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భవనాలు, మౌలిక సదుపాయాలు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లి పట్టణంలో దాదాపు 3500 నుంచి 4 వేల మంది నిరుపేదలకు 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని గతంలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి పేదలకు పట్టాలు ఇచ్చేందుకు వీలుగా ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

రెవెన్యూ అధికారుల పరిశీలనలో భాగంగా బనగానపల్లె పట్టణం భానుముక్కల గ్రామంలో పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని మంత్రి ఆదేశించారు అయితే 3500 నుంచి 4 వేల మందికి 2 సెంట్లు చొప్పున ప్రభుత్వ స్థలం ఇవ్వడానికి దాదాపు 116 నుంచి 140 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరం అవుతోందని అధికారులు తెలిపారు. అలాగే బనగానపల్లెలో ఆటోనగర్ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బనగానపల్లెలో కార్పెంటర్లకు శాశ్వత నివాసాలు ఏర్పాటుకు కార్పెంటర్ కాలనీ ఏర్పాటుపై కూడ సాధ్యసాధ్యాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# ధర్మవరం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం : బిజెపి నేతలు



**ధర్మవరం పెన్ పవర్ మే 05 :** ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు గౌరవనీయులు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వారి కార్యాలయ ఇంచార్జ్ హరీష్ బాబు గారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు అత్యంత అవివేకపూరితమని ఖండించారు. కూటమి ప్రభుత్వం పట్ల అవమానకరంగా వ్యవహరిస్తూ బురద చల్లే ప్రయత్నాలు చేస్తుండటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు గొట్లూరు చంద్ర, లీలావతి, పోతుకుంట రాజు, చంద్రమౌళి, డోలా రాజా రెడ్డి, నబి రసూల్ తదితరులు మాట్లాడుతూ %-% ధర్మవరం పట్టణంలో గత ప్రభుత్వ కాలంలో తాగునీటి కొరత, మురుగునీటి పారుదల సమస్యలు, రహదారి మరమ్మతుల తడబాటు, పౌరసదుపాయాల్లో తీవ్ర లోపాలు వాస్తవంగా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలని గుర్తు చేశారు. ఈ అవినీతి పాలనకు ప్రధాన బాధ్యుడు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గారేనని వారు పేర్కొన్నారు. అలాగే ధర్మవరం చెరువును కబ్జా చేసి, చెరువు కింద ఉన్న మాగాను నిర్లక్ష్యం చేసి, అక్కడి రైతుల పొట్టను గండిపెట్టిన ఏకైక నాయకుడు కేతిరెడ్డి అని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తమ అధినేత కోసం మాత్రమే కాకుండా ప్రజల సంక్షేమం గురించి ఆలోచించాలి, లేనిపక్షంలో ప్రజలే వారి భవిష్యత్తును తీర్మానిస్తారని హెచ్చరించారు. కేతిరెడ్డి హయాంలో ప్రతి పనీ కమీషన్ తో ముడిపడి ఉండేదని, ఏ ప్రభుత్వ పథకం అందాలన్నా కమిషన్ ఇచ్చిన వారికే లబ్ధి చేకూర్చే వారని వారు చెప్పారు. అదేవిధంగా కేతిరెడ్డి, ఆయన అనుచరులు చేసిన కబ్జా గురించి ధర్మవరంలో ప్రతి వ్యక్తికి తెలిసిన విషయమే అని అన్నారు. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేయడమే కాకుండా , ఎంతోమంది అమాయకులను బెదిరించి వారి స్థలాలను బలవంతంగా రాయించుకున్న సంగతి అప్పుడే మర్చిపోయారా అని వారు ప్రశ్నించారు. కేతిరెడ్డి అతని అనుచరులు ఆలీబాబా 40 దొంగలు మాదిరి దందాలు చేశారని, ధర్మవరంలో బిజెపి జెండా ఎగిరిన తర్వాత ఆ 40 దొంగలు తమ అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి బిజెపిలోకి వస్తామంటూ బిజెపి కార్యాలయం తలుపులు కొట్టిన విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. ప్రజల సమస్యల పట్ల స్పందించని గత పాలన, అవినీతి కుంభకోణాలు ధర్మవరం అభివృద్ధిని నిలిచిపోయేలా చేశాయని విమర్శించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల వ్యవధిలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయని తెలిపారు. గౌరవనీయులు సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో తాగునీటి సమస్యలపై అమృత్ పథకం ద్వారా శాశ్వత పరిష్కారం మురుగునీటి పారుదల పనులకు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిధుల కేటాయింపు పీఎం కిసాన్, ఉజ్వల యోజన, జనధన్ యోజన ద్వారా ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధి ధర్మవరం పట్టణ అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.100 కోట్ల మంజూరు మున్సిపాలిటీకి నిధుల మంజూరు, పారదర్శక పాలన నిరుద్యోగులకు జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు, అనారోగ్య అభాగ్యులకు సిఎంఆర్ఎఫ్ నిధుల అందించడం, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అవినీతి లేకుండా, నైతిక విలువలతో పరిపాలన సాగిస్తోందని, ఒక్క రూపాయి లంచం లేకుండా పాలన కొనసాగుతోందని స్పష్టం చేశారు. మా నాయకుడు సత్య కుమార్ యాదవ్ ఇలాంటి అవినీతి వారిని ఎన్నటికీ పార్టీలోకి చేర్చుకోరని, అవినీతి చేసిన వారు దాని ప్రతిఫలం అనుభవించే రోజు దగ్గరలోనే ఉందని వారు హెచ్చరించారు. చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు ప్రజల ముందే నైతిక ప్రమాణానికి సిద్ధంగా ఉన్నారా? అని బీజేపీ నేతలు సవాల్ విసిరారు. ఇందుకోసం, ధర్మవరం అభివృద్ధి పై ప్రజల ఆశలు, విశ్వాసాన్ని గౌరవిస్తూ ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రగతిని కొనసాగిస్తోందని తెలియజేశారు. గౌరవనీయులు నరేంద్ర మోదీ గారి దిశానిర్దేశం, గౌ. సత్యకుమార్ యాదవ్ గారి కృషి, బీజేపీకి ఉన్న అనుభవం ధర్మవరం అభివృద్ధికి దిశానిర్దేశకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి మైనార్టీ నాయకులు నబి రసూల్, డోలా రాజారెడ్డి, పోతుకుంట రాజు, చంద్రమౌళి, వీరనారప్ప, కావేటి మల్లికార్జున, చిన్న బాలముని, పోతులయ్య, గంగాధర, కుంచేపు నారప్ప, పోతు నాగేపల్లి లక్ష్మీనారాయణ, భక్తవత్సల నాయుడు, గొట్లూరు అనిల్, వడ్డే శ్రీనివాసులు, బోయ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి ఆరోపణలపై చర్చకు సిద్ధం కండి : డోల రాజారెడ్డి సవాల్



**ధర్మవరం పెన్ పవర్ మే 5 :** పట్టణంలోని వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు మంత్రి సత్య కుమార్ యాదవ్ పై హరీష్ బాబు పై చేసిన ఆరోపణలపై బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, జింక చంద్రశేఖర్, సాకే ఓబులేష్, గొట్లూరు చంద్రతోపాటు మరో 20 మంది నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు ఎన్డీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన అవినీతి కార్యకలాపాలకు గుర్చి తెలియజేస్తూ, ఎవరు నిజాయితీపరులు? ఎవరు కారు? అన్న విషయాలు ప్రజలకు తెలుసునని తెలిపారు. వాస్తవాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం నిందలు మోపడం సరికాదు అని వారు హితో పలికారు. అవినీతి కార్యకలాపాలపై తాము సిద్ధము అని, ఈనెల 10వ తేదీన జరిగే చెన్నకేశవ స్వామి రథోత్సవం దగ్గరకు ప్రమాణానికి వైసీపీ నాయకులు సిద్ధంగా ఉన్నారా అని వారు సవాల్ విసిరారు. అక్కడే నిజాలను చర్చిద్దామని ఎవరు అవినీతిపరులో? ఎవరు అభివృద్ధికి అడ్డుకాలు వేస్తున్నారు? అనేది ప్రజలే చెబుతారని తెలిపారు.

ఎన్డీఏ ప్రభుత్వం తొమ్మిది నెలల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, ఆ అభివృద్ధిని ఓర్వలేకనే వైఎస్ఆర్సిపి నాయకులు నిందలు వేయడం సరైన పద్ధతి కాదు అని, అభివృద్ధికి సహకరించాలని వారు హితవు పలికారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గుడ్ మార్నింగ్ పేరిటన, ప్రజలకు ఏమి చేశాడో? ప్రజలకు, మోసపోయిన వ్యక్తులకు తెలుసునని, రాజకీయాలకు అతీతంగా ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ విశేష కృషి చేస్తున్నారని, అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో మన నియోజకవర్గానికి గల నిధులను తేవడంలో ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగుల విషయంలో ఇప్పటికే జాబ్ మేళాలు నిర్వహించి, నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడం జరిగిందన్నారు. పెన్షన్, రోడ్లు, వీధి దీపాలు, నీటి కొరత లేకుండా చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీకి ఇప్పటికే నిధులు తేవడం జరిగిందని, ఆ నిధులతో ధర్మవరం అభివృద్ధి తప్పక జరుగుతుందని తెలిపారు. ఇకనైనా వైసీపీ నాయకులు నిజాలు తెలుసుకొని మాట్లాడాలని, లేనియెడల ప్రజలే నీకు బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# గ్రీన్ బెల్ట్ పనులకు ఎమ్మెల్యే దామచర్ల శంఖుస్థాపన

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 05 :** ఒంగోలు నగరంలోని రాంనగర్ లో గ్రీన్ బెల్ట్ పనులకు ఎంఎల్ఏ దామచర్ల జనార్దన్ రావు సోమవారం శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు నగరంలో అపార్ట్మెంట్ కల్చర్ పెరగడంతో వాటిలో ఉండే పెద్దవారికి మంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే రాంనగర్ లో గ్రీన్ బెల్ట్ కు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఒంగోలు నగరంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందిస్తున్నట్లు వివరించారు. ఒంగోలు నగరంలోని ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దామచర్ల తెలిపారు. అమృత్ -2 పథకం కింద 410 కోట్ల రూపాయలతో పాత పైపు లైన్లు మార్చి కొత్త పైపు లైన్ల వేయనున్నట్లు చెప్పారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అప్పటి వరకు ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే ట్యాంకర్ల ద్వారా పంపిస్తామని వివరించారు. టిడ్కో లబ్ధిదారులకు వాటిని పూర్తి చేసి త్వరలో ఇళ్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒంగోలు నగరంలో పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జనార్దన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వర రావు, డివిజన్ కార్పొరేటర్ గోపి, టీడీపీ నాయకులు బండారు మదన్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సూపర్ సిక్స్ హామీలన్నీ అమలుచేస్తాం

ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ

అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారు

సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తాం

అమరావతి పై తప్పుడు ప్రచారం చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారు

మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి




**పొన్నలూరు పెన్ పవర్, మే5 :** ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి అన్నారు. సోమవారం, పొన్నలూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలు, సాగు, త్రాగునీరు, విద్యుత్ తదితర సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ప్రతీ ఒక్క అర్జీనీ స్వయంగా స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నట్లు తెలిపారు. కొండపి నియోజక వర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి మండలాల వారీగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుచున్నదని, అందులో భాగంగా ఈ నెల 3వ తేదీన మర్రిపూడి మండల కేంద్రంలో ప్రత్యేక గ్రీవెన్స్ ను నిర్వహించగా 250కి పైగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరిగిందన్నారు. వాటిలో 100 కి పైగా రెవిన్యూ సమస్యలేనని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రోజు పొన్నలూరు లో జరిగిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఇంటి పట్టాలు మంజూరు, అక్రమ రిజిస్ట్రేషన్స్, మిటేషన్ పై అర్జీలు రావడం జరిగిందని, అలాగే విద్యుత్ కేబుల్స్, ట్రాన్స్ఫార్మర్స్, స్తంభాలు మార్పు పై, అలాగే పంచాయతీ రాజ్ శాఖ కు సంబంధించి సైడు మురుగు కాలువల నిర్మాణాలపై అర్జీలు రావడం జరిగిందని మంత్రి తెలిపారు. వచ్చిన ఆర్జీలను క్షుణ్ణంగా పరిశీలన చేసి సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. అర్జీల పరిష్కారానికి అవసరమైతే జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు లబ్దిదారులకు న్యాయం జరిగేలా కృషి చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మండలాల వారీగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని, సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తామన్నారు.రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు, పెట్టుబడులు చూసి ఓర్వలేకనే వైసీపీ విషం చిమ్ముతోందన్నారు. అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్ మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్ పల్లపోతు రమేష్ బాబు మన్నెం మల్లిఖార్జున రమణయ్య దాసరి కృష్ణారావు నరసింహారావు మండలంలోని నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధికి

# కూటమి ప్రభుత్వం కృషి

**- ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు**





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 05 :** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం అయ్యాలా కూటమి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా కృషి చేస్తుందని, అందులో భాగంగా మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమం అమలు చేస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని బాలాజీ నగర్ లో బీసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జనార్దన్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు తమ స్వశక్తి తో నిలబడటమే కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాతనే మహిళల ఆర్థిక స్వావలంబన సాధ్యం అవుతుందన్నారు. 2014 – 19 హయాంలో తెలుగుదేశం ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి జనార్దన్ రావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వర రావు, మాజీ మునిసిపల్ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, నగర టిడిపి అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, జిల్లా తెదేపా అధికార ప్రతినిధి బండారు మదన్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, డివిజన్ కార్పొరేటర్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిర నిర్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు




**పొదిలి, పెన్ పవర్, మే 5 :** పొదిలిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిర కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు సహకరించిన వారికి ఒంగోలు రాయల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మరియు పొదిలి ఆలూరి కంటి వైద్య శాల యాజమాన్యాలు తమ కృతజ్ఞతలు తెలియజేశాయి అలాగే కంటి పరీక్షలు జరి పి, ఆపరేషన్లు అవసరమైన వారికి ఒంగోలు రాయల్ సూపర్ స్పెషాలిటీ యాజమాన్యం సోమవారం ఉచితంగా తమ వాహనాల్లో ఒంగోలుకు తరలించారు వారికి ఆపరేషన్ల అనంతరం తిరిగి వారి ఇండ్లకు చేర్చగలమని ఒంగోలు రాయల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు సమాజ సేవలో భాగంగా తమ ఆసుపత్రి యాజమాన్యం ఇటువంటి సేవా కార్యక్రమాల్ని నిర్వహి స్తుండటం జరుగుతుందన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఇటువంటి కార్యక్రమాల్ని సద్వినియోగపరచుకోవాలని రాయల్ సూపర్ స్పెషాలిటీ కంటి వైద్య నిపుణులు ఎం నాగసుధామణి, పొదిలి ఆలూరి కంటి వైద్యశాల డాక్టర్ పి.ఖాజావలిలు కోరారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

### - బెస్తవారిపేట ఎంఈఓ సిహెచ్ వి రమణారెడ్డి



**బేస్తవారిపేట, పెన్ పవర్ మే 5 :** విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా 1వ తరగతి ప్రవేశాలకు తల్లిదండ్రులు దరఖాస్తులు చేసుకోవాలని బేస్తవారిపేట ఎంఈఓ సి వి రమణారెడ్డి సోమవారం తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25% సీట్లను పేదలకు ఉచితంగా అవకాశం కల్పించిందని, ఈనెల 2 నుంచి 19వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీల్లో అల్పాదాయ వర్గాలవారు అర్హులని తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశం కొరకు, 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్యలో జన్మించిన పిల్లలు అర్హులన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలలకు 3 కిలో మీటర్ల లోపు దూరంలో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ అవకాశాన్ని పేద కుటుంబాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలుంటే స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని రమణారెడ్డి తెలిపారు.రెమిడియల్ తరగతులు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి. పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు గాను ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమెడియల్ తరగతులు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసినట్లు రమణారెడ్డి తెలిపారు.

## ఫ్రీడమ్ ఫైటర్స్ గురించి విద్యార్థులకు అవగాహన



**బేస్తవారిపేట, పెన్ పవర్ మే 5 :** శాఖా గ్రంధాలయం బేస్తవారిపేటలోసోమవారం వేసవి శిక్షణా తరగతులలో విద్యార్థిని విద్యార్థులు 20 మంది హాజరైనట్లు బేస్తవారిపేట గంధపాలకుడు పివి సుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థులకు టీచర్ గురుస్వామి విద్యార్థిని విద్యార్థులకు ఫ్రీడమ్ ఫైటర్స్ గురించి అబ్దుల్ కలాం, మదర్ తెరిస్సా ల గురించి విద్యార్థులకు తెలియజేయడం,వారి గొప్పతనాన్ని గురించి విద్యార్థుల చేత చెప్పించడం మరియు కథలు చదివించడం,కథలు వినిపించడం మరియు ఇంగ్లీష్ గ్రామర్ మరియు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించడం, ఇంగ్లీష్ ప్రొనౌన్సియేషన్ చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమమునకు ఉపాధ్యాయుడు పివి గురుస్వామి బోధించడం జరిగినది. ఈరోజు విద్యార్థుల విద్యార్థులు 5 మంది సభ్యత్వం తీసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమం గ్రంథ పాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## దేశ సంపదను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 05 :** మావోయిస్టులతో పోరాడే సాకు తో ఆపరేషన్ కగార్ పేరుతో పారా మిలటరీ బలగాలను అడవుల్లోకి దింపి అమాయక ఆదివాసులను చంపుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. ఒంగోలులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ ను నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ అడవులలో జీవించే ఆదివాసులను తరిమికొట్టి అటవీ ఖనిజ సంపదలు, ప్రకృతి వనర్లను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే లక్ష్యంగా భూతకపు ఎన్కౌంటర్లు జరుగుతున్నాయని, అమాయక ఆదివాసి గిరిజనులు ఊచకోచకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆపరేషన్ కగార్ ఆదివాసీల అణిచివేత చత్తీస్గడ్, అబూజ్ మడ్ ప్రాంతంలో మొత్తం నాలుగు వేల చదరపు కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతంలో కొనసాగుతుందన్నారు. ఇందులో 237 గ్రామాలలో గోండు, మోదియా, హౌస్, హల్వా తెగలకు చెందిన 35 వేల మంది ఆదివాసీల జీవిస్తున్నారని, అక్కడ ఈనప ఖనిజం, గ్రాఫైట్ సున్నపురాయి, యురేనియం తదితర ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వాటిని కార్పోరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం 14 ఒప్పందాలు కుదుర్చుకుందని అన్నారు. ఈ ఒప్పందం అమలులో భాగంగానే మోడీ ప్రభుత్వం అమాయక ఆదివాసీలపై హత్యాకాండని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే 400 మంది ఆదివాసీలు మరణించారని ప్రభుత్వ లెక్కలు చెబుతుందన్నారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా చట్టసభలలో, సభల బయట సిపిఐ పోరాటం సాగిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు పాల్గొన్నారు.

## అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు : జిల్లా కలెక్టర్





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 05 :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే ఊరుకోబోనని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియ అధికారులను హెచ్చరించారు. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన 'మీ కోసం" కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చే అర్జీల పై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టరు ఆదేశించారు.

'మీ కోసం' కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కార చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నందున ప్రతి ఒక్క అర్జీ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్ లో వచ్చిన వినతులను చూడాలని ఆమె చెప్పారు. సమస్యల వలన క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రములో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, డిప్యూటి కలెక్టర్లు జాన్సన్, పార్ధసారధి, వరకుమార్, విజయజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తర్లుపాడు పోలీస్ స్టేషన్‌కు డ్రోన్ కెమెరా వితరణ




**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మే 05 :** ప్రకాశంజిల్లా తర్లుపాడు పోలీస్ స్టేషన్ కు బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్న తర్లుపాడు వాసి వెలుగు కాశీరావు డ్రోన్ కెమెరా ను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయం లో సోమవారం ఎస్పీ దామోదర్ ను కలిసి సంబంధిత పరికరాలను అందజేశారు. సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో జిల్లా పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరా ను అందించిన కాశీరావు ను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ కెమెరా ద్వారా లా అండ్ ఆర్డర్, నేర నియంత్రణ, రద్దీగా ఉండే జంక్షన్లు పర్యవేక్షించడం ద్వారా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ట్రాఫిక్ నిర్వహణకు, ముఖ్యమైన కేసుల్లో క్రైమ్ సీన్ మానిటరింగ్ ద్వారా నేర దృశ్యాలు సాక్షాల సేకరణకు, పలు బందోబస్తులు, బహిరంగ సభలు, జాతరలు,ఊరేగింపు సమయంలో జన సమూహాన్ని పర్యవేక్షించడం ద్వారా క్రౌడ్ మేనేజ్మెంట్ ద్వారా అవాంఛనీయ సంఘటనలు నిలువరించుట, విపత్తు సమయంలో రెస్క్యూ, సహాయక చర్యలు, తప్పిపోయిన వ్యక్తులు, అనుమానితులను గుర్తించడం వంటి టార్గెట్ ట్రాకింగ్ కు, తీర ప్రాంత గస్తీకి, ఈవ్ టీజింగ్ సర్వేలన్స్, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలకు అవకాశం ఉన్న శివారు, నివాసిత ప్రాంతాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగానే గుర్తించి అక్కడకు డ్రోన్లను పంపి నిఘా ఏర్పాటుచేశామన్నారు. పోలీసుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించటానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, పోలీస్ సిఐ వెంకటేశ్వర్లు, తర్లుపాడు ఎస్సై బ్రహ్మ నాయుడు, సిబ్బంది ఉన్నారు.

## కోవిలంపాడు పాఠశాలను యధావిధిగా కొనసాగించాలి

### - విద్యా కమిటీ చైర్మన్ చందలూరి బాల కాశయ్య



**చంద్రశేఖరపురం, పెన్ పవర్, మే 5 :** చంద్రశేఖరపురం మండలం కోవిలంపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చందలూరి బాలకాశయ్య మరియు గ్రామస్తులు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ చందలూరి బాల కాశయ్య మరియు గ్రామస్తులు మాట్లాడుతూ మా పాఠశాలను డీగ్రేడ్ చేయుచున్నట్లు తెలిపియున్నారు. మా గ్రామంలో పాఠశాల లేనియెడల విద్యార్థులు డ్రాప్ ఔట్స్ మారే అవకాశం ఉందని, పాఠశాల లేకపోతే తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపే అవకాశం లేదని అన్నారు. మా పాఠశాలను డి గ్రేడ్ చేయవద్దని విద్యార్థులు అనేక ఇబ్బందులు పడతారని మండల విద్యాశాఖ అధికారులకు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కు తెలియపరచి వినతి పత్రం అందజేశామని అన్నారు. రాష్ట్రంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు ఎక్కడ కూడా ఉండే అవకాశం లేదని తెలిపారని అన్నారు. కానీ ప్రస్తుతం మన జిల్లాలో మొత్తము 180 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా వాటిలో 58 పాఠశాలను అప్గ్రేడ్ చేయగా మిగతా 57 పాఠశాలలను యధావిధిగా కొనసాగించి మిగిలిన 64 పాఠశాలలు మాత్రమే డి గ్రేడ్ చేశారని అందులో మా పాఠశాల డీ గ్రేడ్ చేసిన వాటిలో ఉండడంతో మా గ్రామ ప్రజలకు తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. మా పాఠశాలలో మొత్తము 116 మంది విద్యార్థులు చదువుతుండగా అందులో 6,7,8 తరగతులకు 64 మంది పేద విద్యార్థులు చదువుకొనుచున్నారని తెలిపారు.

మా గ్రామం నుండి చంద్రశేఖరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోవడానికి నాలుగు కిలోమీటర్లు దూరం ఉండగా అందులో మూడు కిలోమీటర్ల దూరం 167 బి జాతీయ రహదారి మీదుగా ప్రయాణించవలసి ఉంటుందని అలాగే శీలంవారిపల్లి లోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ 2 కు విద్యార్థులు వెళ్లాలంటే 4 కిలోమీటర్లు దూరము ప్రయాణించవలసి ఉంటుందని అలాగే సుమారు ఒక కిలోమీటర్ జాతీయ రహదారి మీదుగా ప్రయాణించవలసి ఉంటుందని తెలిపారు. మా పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని అధికారులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అమడసాని బాల కేశవరెడ్డి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ డోలా తిరుపతయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో అధిక దిగుబడి

### మండల వ్యవసాయాధికారి బి. సంపత్ కుమార్



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 5 :** భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వాడినట్లయితే తక్కువ ఖర్చు తో అధిక దిగుబడి సాధించడంతోపాటు నేల యొక్క ఆరోగ్యాన్ని కూడా కాపాడవచ్చునని మండల వ్యవసాయ అధికారి బి.సంపత్ కుమార్ తెలిపారు. సోమవారం చంద్రశేఖరపురం మండలంలోని చింత పూడి రైతు సేవ కేంద్రం పరిధిలో మట్టి నమూనాలు సేకరించి పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలలో ఏ ఏ పోషకాలు ఎంతెంత మోతాదులో ఉన్నాయని తెలుసుకోవాలి అంటే భూసార పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేశారు. భూసార పరీక్షలు చేసుకోవడం వలన ఆ నేలకు సరిపోయేటటువంటి ఏఏ పంటలు సాగు చేయాలి, ఏ ఏ పోషక పదార్థాలు ఎంతెంత మోతాదులో ఉన్నాయో, సేంద్రీయ కర్బన శాతం ఏ విధంగా ఉందనే విషయం తెలియడంతో పాటు నేల యొక్క ఆమ్లక్షార గుణాలు దానితోపాటు సూక్ష్మ పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చని దాని అనుగుణంగా ఎరువులను వాడినట్లయితే నేల యొక్క సారవంతాన్ని కాపాడడంతో పాటు అధిక దిగుబడిని సాధించవచ్చునని తెలియజేశారు.

మట్టి నమూనాలు సేకరించేటప్పుడు ముందుగా నేలపై భాగంలో ఉన్నటువంటి చెత్తాచెదారం తీసివేయాలి మట్టి నమూనాలు సేకరించేటటువంటి పొలంలో పది నుండి 12 చోట్ల మట్టిని సేకరించాలి, పారా లేదా పలువు ఉపయోగించి వి ఆకారంలో ఆరు అంగుళాలు గుంత తీసి పైనుండి కింది వరకు ఒకే మందంలో పలుచని పొర వచ్చే విధంగా మట్టిని సేకరించవలసినదిగా తెలియజేశారు సేకరించినటువంటి మట్టిని మట్టి పెల్లలు లేకుండా మెత్తగా చేసి నాలుగు భాగాలుగా విభజించి ఎదురెదురు భాగాలను తీసేసి మిగతా మట్టిని బాగా కలిపి మిగిలిన ఎదురు భాగాలను తీసేయవలెను. మొత్తం అరకేజీ వచ్చే విధంగా చేసి సేకరించినటువంటి నమూనాలో రైతు గతంలో ఏ ఏ పంటలు వేశారు, ఎంత దిగుబడి వచ్చింది, రాబోయే సీజన్లలో ఏఏ పంటలు వేస్తారని పూర్తి సమాచారంను నింపి శాంపిల్ పంపించవలసి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పావలి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం రవి, రాజశేఖర్, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

## పోలీసు గ్రీవెన్స్‌కు 80 ఫిర్యాదులు



**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్, మే 05 :** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదిదారుల అర్జీలను జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్, పోలీస్ అధికారులు స్వీకరించి వారితో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పియస్ డిఎస్పీ రమణ కుమార్, ఒంగోలు రూరల్ సీఐ యన్.శ్రీకాంత్ బాబు, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు రజియా సుల్తాన, సిబ్బంది పాల్గొన్నారు.

## టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధనే లక్ష్యంగా ఐక్యంగా కృషి చేస్తాం



**కొమరోలు పెన్ పవర్ మే 5 :** పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో మంచి ఫలితాల సాధనే ఏకైక లక్ష్యంగా అందరం సమిష్టిగా కృషి చేసేందుకు కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులందరం ఐక్యంగా నిర్ణయించుకున్నామని ఆ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్ అశ్విని కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలు దిగజారిపోయాయని, గత మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఆ పాఠశాలకు కేవలం 39 శాతం మాత్రమే ఉత్తీర్ణత లభించడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రామస్తుల నుంచి ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహాన్ని, వ్యతిరేకతను, నిరసనను ఎదుర్కొంటున్నారు. అంతేకాక ఆ పాఠశాలలో ఇటీవల జరుగు తున్న కొన్ని సంఘటనలపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యా యులలో ఐక్యత కరువైందని ఇటీవల ఆ పాఠశాలలో కొన్ని దురదృష్టకర సంఘటనలు కూడా జరిగాయని, దీనితో ఆ ప్రభావం విద్యార్థులపై పడుతున్నదనే ప్రచారం సాగుతున్నది. ఈ నేపథ్యంలో ఆ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో పాఠశాల పై, ఉపాధ్యాయులపై నమ్మకం పెంచేందుకు వీలుగా ఆ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్ అశ్విని కుమార్ అధ్యక్షతన సోమవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించుకున్నారు. ఆ సందర్భంగా బేదాభిప్రాయాలను విడనాడి, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థుల కొరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి రెమిడీయల్ క్లాసులకు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులందరూ హాజరు అవుతామని ,ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్న 11:45 వరకు క్లాసులు నిర్వహించి విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఐక్యంగా నిర్ణయించుకున్నారు .స్టడీ అవర్స్ ను ఈనెల 18 తేదీ వరకు ఏర్పాటుచేసిన టైం టేబుల్ ప్రకారం నిర్వహిస్తామని తద్వారా సప్లిమెంటరీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేందుకు కలిసికట్టుగా పనిచేసేందుకు నిర్ణయించుకున్నట్లుగా అశ్విని కుమార్ తెలిపారు. ఇటీవల ఆ పాఠశాలలో జరిగిన కొన్ని సంఘటనలను దురదృష్టకర సంఘటనలుగా వారు పేర్కొంటూ వాటిని విస్మరించి ఇక నుంచి అందరం కలిసికట్టుగా ,ఐక్యంగా పాఠశాల అభివృద్ధికి ,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు కృషి చేస్తామని ముక్తకంఠంతో ప్రకటించారు. ఆ కార్యక్రమానికి ఆ పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు అశ్విని కుమార్, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ధ్యేయం

### వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ మే 5 :** రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ధ్యేయమని, తొలకరి చినుకులు పడగానే ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తుందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గిద్దలూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అశోక్ రెడ్డి రైతులకు తీపి కబురు చెప్పారు. పెట్టుబడి సహాయం కింద తొలకరి చినుకులు పడగానే రూ.7 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. తర్వాత రెండు విడతల్లో 7వేలు, 6 వేలు రైతులకు అందిస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదని పంట నష్టం కూడా అందించిన దాఖలు లేవని అన్నారు. అడపాదడపా కొంతమందికి ఇచ్చి వారి వ్యక్తిగత మీడియాలో ఆర్భాటంగా ప్రచారం చేశారని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గత ప్రభుత్వాన్ని విమర్శించారు. 96 రకాల వ్యవసాయ పనిముట్లను గిద్దలూరు నియోజకవర్గంలో రైతులకు సబ్సిడీపై అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలని ప్రతి ఒక్కటి నిలబెట్టుకుంటుందని బడులు తెరిచిన వెంటనే తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థి తల్లికి 15 వేల రూపాయలు అందించే కార్యక్రమం కూడా ప్రభుత్వం చేపట్టబోతుందన్నారు. ఇది రైతుల పక్షపాతి ప్రభుత్వమని రైతులకు మేలు చేసే ప్రభుత్వమని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డ్, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, మరియు గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, గిద్దలూరు అగ్రికల్చర్ ఏడి బాలాజీ నాయక్, మండల ఏవోలు, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రా రెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్లు దుత్తా బాల ఈశ్వరయ్య, కేతం శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ శానేశా వలి, బోనేని వెంకటేశ్వర్లు, సొరెడ్డి మోహన్ రెడ్డి, మరియు పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో విచిత్రవాతావరణం



**విజయవాడ, మే 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం వరకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. మంగళవారం వరకు పలు చోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు చెట్ల కిందకు వెళ్లి నిలబడరాదని ఏపీ విపత్తులు నిర్వహణ శాఖ సూచించింది. మరోవైపు రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు 41.5 డిగ్రీల నుంచి 43 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారుశ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం , అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి-మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం నాడు మోస్తరు వర్షాలు కురవనున్నాయి. తిరుపతి మంగనెల్లూరులో శనివారం 42.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కిందకు వెళ్లకూడదని సూచించారు. నేడు కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 41-42.5ళీ%జ% మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని, ఎండల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. విశాఖ, అల్లూరి, ఉభయ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు.. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురవనున్నాయి. పలు ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశముందన్న రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు విజయవాడ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. భారీ ఈదురు గాలులు, ఉరుములతో వర్షం కురుస్తోంది. వాతావరణం చల్లగా మారడంతో సేదదీరుతున్నారు నగర ప్రజలు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

**రెడ్ అలెర్ట్...**


5 జిల్లాలకు రెడ్ అలర్ట్, 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారరు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్. ప్రకాశం,కృష్ణా,బాపట్ల, నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు చెప్పారు. పిడుగులు కూడా పడొచ్చు. గంటకు 60-85 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఇక అల్లూరి సీతారామరాజు, విజయనగరం, అనకాపల్లి పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురవొచ్చు. విశాఖ, కాకినాడ, కోనసీమ పరిసర జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదని సూచించారు. ప్రకాశం, కృష్ణా, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయంది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. గంటకు 60-85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయంది.ఇక
అల్లూరి సీతారామరాజు, విజయనగరం, అనకాపల్లి, విశాఖ, కాకినాడ, కోనసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది విపత్తుల నిర్వహణ సంస్థ. ఈ జిల్లాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయంది. విశాఖ, కాకినాడ, కోనసీమ పరిసర జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు పడతాయంది.ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదని చెప్పింది. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది.

# జగన్ అష్టదిగ్భంధనం



**విజయవాడ, మే 5, పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ కు ఇప్పుడు కష్టాలు మొదలవుతాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావస్తుండటంతో ఇక జగన్ ను అన్ని రకాలుగా అష్టదిగ్భంధనం చేసే పనిలో ఉన్నారు. ఎటూ కదలకుండా కేసులు జగన్ ను చుట్టుముట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. టీడీపీ కార్యకర్తలు ఎప్పటి నుంచో జగన్ అరెస్ట్ కోసం ఎదురు చూస్తున్నారు. తమ అధినేత చంద్రబాబును నాడు స్కిల్ డెవెలెప్ మెంట్ స్కామ్ కేసులో అరెస్ట్ చేసి యాభై రెండు రోజుల పాటు రాజమండ్రి జైలులో ఉంచిన ఘటనను నేటికీ మరిచిపోలేకపోతున్నారు. చిన్నా చితాకా నాయకులను అరెస్ట్ చేసినప్పటికీ, వివిధ కేసులను నమోదు చేసినప్పటికీ వారు శాంతించడం లేదు. అసలు పెద్ద చేపను పట్టుకోవాలంటూ సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లు ఫైర్ అవుతున్నారు. దీంతో ఒక్కొక్క కేసు కూడా జగన్ మెడకు చుట్టుకునే అవకాశాలున్నాయి. మద్యం స్కామ్ కేసులో కీలక నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు జగన్ పై కేసులు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన రాజ్ కసిరెడ్డి ఇచ్చిన వాంగ్మూలంతో పాటు కస్టడీలో ఆయన చెప్పిన విషయాలతో జగన్ పై కేసు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే ఆషామాషీగా కాకుండా పక్కా ఆధారాలతో కేసులు నమోదు చేయాలని పై నుంచి ఆదేశాలు ఉండటంతో అన్నీ ఆధారాలను తీసుకున్న తర్వాత కేసు నమోదు చేసే అవకాశముందిమరొకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక దందాపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇసుకతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలను కూడా బయటకు తీస్తున్నారు. ఇక విశాఖపట్నంలో పలు చోట్ల భూకబ్జాలకు పాల్పడిన విషయాలపై కూడా కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయి. వీటన్నింటికీ సూత్రధారి జగన్ అని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి. జగన్ ను అరెస్ట్ చేయాలంటే ఒక్క కేసుతో సరిపెట్టడం కంటే వరస కేసులు నమోదు చేస్తూ జైలులో నుంచి బయటకు రానివ్వకుండా చేయాలన్న ఆలోచనలో ఉండి అన్ని కేసులను కూలంకషంగా శోధించి అందుకు సంబంధించిన ఆధారాలను పకడ్బందీగా సేకరిస్తున్న పోలీసులు త్వరలోనే కేసు నమోదు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నట్లు తెలిసింది. అందుకే ఇన్ ఛార్జుల సమావేశంలో... రాజధాని అమరావతి నిర్మాణ పనులు ప్రారంభమయ్యే వరకూ వేచి ఉన్న పోలీసులు ఇప్పుడు కేసుల విషయంలో మరింత వేగం పెంచారు. లిక్కర్ స్కామ్ తో పాటు శాండ్ స్కామ్, బియ్యం అక్రమ రవాణా, భూ కబ్జాలు ఇలా అన్ని వైపుల నుంచి కార్నర్ చేసేలా నరుక్కుంటూ వస్తున్నారు. జగన్ కు కూడా ఈ సంకేతాలు అందడంతోనే ఇటీవల జరిగిన జిల్లా ఇన్ ఛార్జి సమావేశాల్లో ఫ్రీ హ్యాండ్ ఇచ్చారంటున్నారు. వారి ముందు క్యాలెండర్ కూడా పెట్టారంటున్నారు. బూత్ లెవెల్ లో నియామకాలు చేపట్టేందుకు కూడా డెడ్ లైన్ పెట్టారని, తాను బయట ఉండే అవకాశంలేదని తెలుసుకుని జగన్ ఈ రకమైన డెసిషన్ తీసుకున్నారని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# మూడేళ్లలో ముగింపు సాధ్యమేనా



**గుంటూరు, మే 5, పెన్ పవర్:** అమరావతి రాజధాని రీలాంచ్ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన పూర్తయిన తర్వాత పాత డిజైన్లతోనే నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు సంబంధించిన డిజైన్లు పూర్తి కావడంతో పాటు వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో ఇక నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీనులైన వేదిక నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడేళ్లలో అమరావతి రాజధాని పనులను పూర్తి చేస్తామని చెప్పారు. మోదీ కూడా తన ప్రసంగంలో మూడేళ్లలో పూర్తి అవుతుందని తెలిపారు. దీంతో అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతలన్నీ మున్సిపల్ మంత్రి నారాయణకు చంద్రబాబు నాయుడు అప్పగించారు.అయితే మూడేళ్లలో అమరావతి నిర్మాణపనులు పూర్తి కావడం అంటే ఆషామాషీ కాదు. 365 రోజులు 24 %శ% 7 పనిచేసినా సమయం సరిపోతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పునాదులు తీయడం నుంచి నిర్మాణాలు పూర్తి చేయాలంటే అంత సులువు కాదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఒక్కొక్క టవర్ నిర్మాణం చేయాలంటే ఎంతో సమయం తీసుకుంటుంది. అందుకు అవసరమైన ముడిసరుకుతో పాటు అనుభవజ్ఞులైన ఇంజినీర్లతో పాటు కార్మికులు కూడా అవసరం. అంతా తీసుకున్నా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పరిస్థితులు రాజధాని నిర్మాణ పనులకు తరచూ అంతరాయం ఏర్పరచే అవకాశముందని అంచనాలు వినపడుతున్నాయి వర్షాలు.. తుపానులు... సముద్ర తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం కావడంతో నిత్యం వర్షాలతో పాటు తుపానులు కూడా ఏడాదిలో ఎక్కువ సార్లు వస్తుంటాయి. జులై నెల వచ్చిందంటే ఇక వర్షాలు మామూలుగా పడవు. ఆగస్టు నుంచి కొంత వర్షాల విషయంలో తెరిపి ఇచ్చినప్పటికీ అక్టోబరు, నవంబరు నెలలో తుపానులు పొంచి ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతానికి అమరావతి దగ్గరగా ఉండటంతో ఈదురుగాలులతో పాటు భారీ వర్షాలు పడితే పనులకు ఆటంకం ఏర్పడే అవకాశాలున్నాయంటున్నారు. మే నెలలో డిజైన్లు ఖరారయి పనిలో దిగి పునాదులు తవ్వేసరికి జులై వచ్చేస్తుంది. ఇక వర్షాలతో పనులు ముందుకు సాగే అవకాశం లేదు. పోలవరం పనులే పదేళ్ల నుంచి వివిధ ఆటంకాలతో పూర్తి కాకపోవడాన్ని చూసినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వేసవిలో కూడా అకాల వర్షాలు ముంచెత్తుతున్నాయి. మరో వైపు కృష్ణానదికి వరద ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది. వరద వస్తే మాత్రం అమరావతి ప్రాంతంలో నీరు చేరుతుంది. ఇది కూడా పనులకు ఆటంకంగా మారతాయి. వీటికి తోడు పండగలు, పబ్బాలు ఇలా అన్ని కలుపుకుంటూ పోతే మూడేళ్ల సమయం ఇంత పెద్ద సమయంలో పనులు పూర్తి చేయడం సాధ్యం కాకపోవచ్చన్నది ఇంజినీరింగ్ నిపుణుల అంచనా. ఏదైనా ఒక భవనం అయితే పూర్తి చేయవచ్చు కానీ.. యుద్ధ ప్రాతిపదికపై అన్ని హంగులతో బరిలోకి దిగినా ప్రకృతి ఏ మేరకు రాజధాని నిర్మాణానికి సహకరిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ టెన్షన్ రేపుతుంది. అయితే చంద్రబాబు ఆదేశాల మేరకు టెండర్లు దక్కించుకున్న సంస్థలు వీలయినంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్న లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు




**నెల్లూరు, మే 5, పెన్ పవర్:** జనసేనలో చేరికలు నిలిచిపోయాయి. గత కొద్ది రోజుల నుంచి కార్పేటర్లు మినహాయించి అదీ అవసరమైన విశాఖ వంటి ప్రాంతాలల మాత్రమే చేరికలు జరిగాయి. అంతే తప్ప ఒక స్థాయి నేతలు ఎవరూ జనసేనలో చేరకపోవడానికి కారణాలేంటన్న దానిపై పార్టీలో చర్చ జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పటయిన తొలినాళ్లలో జనసేనలో భారీ స్థాయిలో చేరికలు కొనసాగాయి. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయ భాను, కిలారు రోశయ్య తదితరులు పార్టీలో చేరారు. దీంతో ఇంకా అనేక మంది క్యూ లో ఉన్నారన్న ప్రచారం సాగింది. అయితే కొందరు నేతలు టీడీపీ వైపు వెళ్లిపోయారు. కాపు సామాజికవర్గమయినా ఆళ్ల నాని టీడీపీలో చేరిపోయారు. అయితే చేరిన వారంతా పెద్దగా యాక్టివ్ గా లేకపోవడంతో పాటు వారికి ప్రాధాన్యత కూడా దక్కడం లేదన్న అభిప్రాయం బలంగా ఏర్పడింది. జనసేనలో చేరితే అక్కడ పవన్ కల్యాణ్ వద్దకు వెళ్లాలంటే ముందు చాలా మంది నేతలను దాటుకుని వెళ్లాల్సి ఉంటుందని, కండువా కప్పే సమయంలో తప్ప మరోసారి ఆయనను కలిసే అవకాశముండదని అర్థమయింది. వైసీపీలో జగన్ తరహాలోనే ఇక్కడ కూడా ఉండటంతో రెండింటికీ పెద్ద తేడా ఏముందన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. తోట త్రిమూర్తులు వంటి వారు కూడా జనసేనలోకి వస్తారని, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్దయెత్తున నేతలు వచ్చి చేరిపోతారన్న ప్రచారం చివరకు ప్రచారానికే పరిమితమయింది ఆసక్తి చూపని పవన్... కానీ చేరికలకు పవన్ కల్యాణ్ పెద్దగా ఆసక్తి కనపర్చడం లేదని తెలిసింది. నేతలు ఎక్కువయ్యే కొద్దీ అనవసర టెన్షన్ తప్ప మరొకటి ఉండదని భావించి పవన్ కల్యాణ్ చేరికలకు సుముఖంగా లేరంటున్నారు. ప్రస్తుతం సాఫీగా సాగుతున్న పార్టీలో కొత్త వారిని చేర్చుకుని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకని ఆయన ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. విశాఖ నేత అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరేందుకే వైసీపీకి రాజీనామా చేసినప్పటికీ పవన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో ఆయన టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఇలా అనేక మంది నేతలు ప్రయత్నించినప్పటికీ పవన్ కల్యాణ్ రెడ్ సిగ్నల్ వేయడంతోనే వారు ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్నారని కూడా అంటున్నారు. రొకవైపు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి బయలుదేరిందని, కేవలం అమరావతి మీదనే ఫోకస్ పెట్టడం, రాజధాని నిర్మాణానికే నిధులు కేటాయించడం, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, అందుకే జనసేన, టీడీపీలో చేరడం కంటే వైసీపీలో కొనసాగడమే మంచిదన్న ఆలోచనలో కూడా కొందరు ఉన్నారు. నేతలు అన్ని లెక్కలు వేసుకున్న తర్వాత ఇతర పార్టీలో చేరడం కంటే ఉన్న పార్టీలోనే ఉండి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చన్న భావనలో ఉన్నారని చెబుతున్నారు. మొత్తం మీద జనసేనలో చేరికలు లేవని అంటున్నారు. మరి ఏది నిజమనేది చూడాలి

# సగం ధరకే పసిడి దాణా

**ఏలూరు, మే 5, పెన్ పవర్:** పాడి రైతులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీతో పోషకాలతో కూడిన పశువుల దాణా అందించనుంది.
కుటుంబానికి గరిష్టంగా రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకు గాను 450 కేజీల దాణాను పంపిణీ చేయనుంది. రూ.1100 విలువైన 50 కేజీల దాణా బస్తాను రూ.555కే అందించనుంది. పశు గ్రాసం కొరతను అధిగమించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు.పశువుల పెంపకందారులకు పోషకాలతో దాణా అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. కిలో రూ.22.11కు కొనుగోలు చేసి రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యశాలల ద్వారా రూ.11.10కే పంపిణీ చేయనుంది. 20 శాతం ప్రొటీన్ కలిగిన పశువుల దాణాను పాడిరైతులకు అందించనుంది. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడిరైతులను ఈ లబ్ధి పొందేందుకు అర్హులుగా నిర్ణయించింది.ఒక్క కుటుంబానికి రెండు పెద్ద పశువులు, ఒక దూడకు 90 రోజులకు విడతల వారీగా 450 కిలోల దాణాను 50 శాతం రాయితీపై పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 21 లక్షల మంది పాడిరైతులకు లబ్ధి చేకూరేలా రూ.69 కోట్ల వ్యయంతో 31,067 టన్నుల దాణా పంపిణీకి ఏపీ పశు సంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది.50 కిలోల పశువుల దాణా బస్తాను రూ.1,100కు కొనుగోలు చేసి రూ.555లకే పాడి రైతులకు అందజేస్తారు. రైతులకు 50 శాతం రాయితీతో దాణా పంపిణీ చేయడం వల్ల ఆర్థికంగా అదనపు భారం పడుతున్నప్పటికీ...రైతులు వేసవిలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు ఈ చర్యలు చేపట్టారు.పశువుల విక్రయాలు తగ్గించేందుకు, పాడి ఉత్పత్తులు పెంచేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు. అర్హులైన పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు కోరారు.
ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంపై అప్డేట్ ఇచ్చింది. మే నెలలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందించనుంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజనతో కలిపి దీనిని అమలు చేస్తారు.రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా మూడు విడతల్లో రూ.20 వేలు అందించనున్నారు. ఇందులో పీఎం కిసాన్ ద్వారా కేంద్రం రూ.6000, రాష్ట్ర ప్రభుత్వం రూ.14000 కలిపి మొత్తం రూ.20 వేలు అందించనున్నారు. ఈ ఆర్థిక సాయాన్ని మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు.

## మహానాడులో అన్ని స్పెషల్సే...

# 7న భూమి పూజ


**కడప, మే 5,** : ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించింది. ఈ నెల 27 నుంచి మూడు రోజులపాటు మహానాడును కడప జిల్లా కేంద్రంలో నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో.. పార్టీ ఎమ్మెల్సీలు బీద రవిచంద్రా, దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు కడపకు వెళ్లి.. పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు.కడప సమీపంలోని సీకే దిన్నె మండలం చెర్లోపల్లి, పబ్బాపురం గ్రామాల పరిధిలోని భూములను పార్టీ అధిష్ఠానం అనుమతితో.. మహానాడు కోసం ఎంపిక చేశారు.మహానాడు ప్రాంగణం, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌కు స్థలాలను ఎంపిక చేశారు. ఈ స్థలం కడపను తిరుపతి, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్ మార్గాలతో కలిపేదిగా ఉందని నేతలు చెబుతున్నారు.స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి ద్వారా భూముల యాజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకున్నారు.శాటిలైట్ మ్యాప్ ద్వారా మహానాడుకు అవసరమైన స్థలాల వివరాలను.. నేతలకు కమలాపురం ఎమ్మెల్యే వివరించారు. మరింత స్థలం అవసరమైనా రైతుల అనుమతి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.మహానాడు 2025కు సంబంధించి ఈ నెల 7న పనులకు భూమిపూజ నిర్వహించి, వేగంగా పూర్తి చేయాలని నేతలు నిర్ణయించారు.పార్టీలో సంస్కరణలు తీసుకురావడానికి, యువతకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఈ మహానాడు వేదికగా మారే అవకాశం ఉంది. పార్టీలో యువ నాయకులకు పెద్ద పదవులు ఇవ్వడం, పార్టీ నిర్మాణంలో మార్పులు వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది.ఈ వేడుక సందర్భంగా నారా లోకేష్‌కు పార్టీలో మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. కొత్త తరం నాయకత్వానికి పెద్దపీట వేయాలనే యోచనలో తెలుగుదేశం పార్టీ ఉంది.పార్టీ శ్రేణులను ఏకం చేసి.. వారిలో నూతనోత్సాహాన్ని నింపడానికి ఈ మహానాడు దోహదపడుతుందని టీడీపీ నేతలు చెబుతున్నారు.తెలుగుదేశం పార్టీ మహానాడులో వంటలు ఎప్పుడూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ వేడుకకు హాజరయ్యే వేలాది మంది కార్యకర్తలకు రుచికరమైన, సాంప్రదాయ వంటకాలను వడ్డిస్తారు. ప్రతి సంవత్సరం, మహానాడులో వంటల ప్రత్యేకతలు మారుతూ ఉంటాయి.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సాంప్రదాయ వంటకాలకు మహానాడులో ప్రాధాన్యత ఇస్తారు. పులిహోర, దద్దోజనం, పొంగలి, సాంబారు, రసం, కూరలు, పప్పు, పెరుగు, మజ్జిగ వంటి వంటకాలు తప్పనిసరిగా ఉంటాయి. స్థానిక రుచులకు అనుగుణంగా ప్రత్యేక వంటకాలు కూడా తయారు చేస్తారు.

# గిల్‌కు టెస్ట్ వైస్ కెప్టెన్సీ పగ్గాలు.. బుమ్రాను తప్పించడానికి కారణం ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** జూన్ 20 నుంచి జరగనున్న ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ కు టీమిండియా వైస్ కెప్టెన్ ఎవరో ఒక క్లారిటీ వచ్చేసింది. రోహిత్ శర్మ డిప్యూటీగా యువ బ్యాటర్ శుభమాన్ గిల్ ను టెస్ట్ వైస్ కెప్టెన్ గా ఎంపిక చేయడం దాదాపుగా ఖాయమైంది. మరో వారం రోజుల్లో ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కు భారత జట్టును ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో భారత రెగ్యులర్ టెస్ట్ కెప్టెన్ బుమ్రాకు బీసీసీఐ షాక్ ఇచ్చినట్టు తెలుస్తుంది. బుమ్రాను టెస్ట్ వైస్ కెప్టెన్ నుంచి తప్పించడానికి కారణం లేకపోలేదు. వర్క్ లోడ్ మేనేజ్ మెంట్ కింద బుమ్రాకు వైస్ కెప్టెన్సీ ఇవ్వట్లేదు.
ఇంగ్లాండ్ తో భారత్ 5 టెస్ట్ మ్యాచ్ లో సుదీర్ఘ సిరీస్ ఆడనుంది. దాదాపు రెండు నెలల పాటు జరిగే ఈ మెగా సిరీస్ కు బుమ్రా గాయపడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకవేళ రోహిత్ శర్మ ఫిట్ గా లేకపోతే అతని స్థానంలో వైస్ కెప్టెన్ పూర్తి ఫిట్ నెస్ తో ఉండాలి. కానీ ఒక ఫాస్ట్ బౌలర్ గా బుమ్రా ఫిట్ నెస్ పై అనుమానాలు నెలకొన్నాయి. ఇంగ్లాండ్ లో కూడా బుమ్రాను అని టెస్టులు ఆడించే ఉద్దేశ్యంలో బీసీసీఐ లేనట్టు తెలుస్తోంది. బుమ్రా మూడు సంవత్సరాలుగా టెస్ట్ క్రికెట్‌లో వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు రోహిత్ గైర్హాజరీలో ఈ ఫాస్ట్ బౌలర్ మూడు మ్యాచ్‌లలో భారత జట్టుకు నాయకత్వం వహించాడు. ఇటీవలే ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రోహిత్ స్థానంలో చివరి టెస్టులో కెప్టెన్సీ చేస్తూ బుమ్రా గాయపడ్డాడు. దీంతో సుదీర్ఘ ఫార్మాట్ లో బుమ్రాకు వీలైనంత ఎక్కువరెస్ట్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోందట. మరోవైపు గిల్ ప్రస్తుతం వైట్ బాల్ ఫార్మాట్ లలో వైస్ కెప్టెన్ గా కొనసాగుతున్నాడు. టీ20ల్లో సూర్య కుమార్ యాదవ్.. వన్డేల్లో రోహిత్ శర్మ డిప్యూటీగా కొనసాగుతున్నాడు. భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని గిల్ కు వైస్ కెప్టెన్సీ ఇవ్వాలనే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్టు తెలుస్తుంది. ఇంగ్లాండ్ తో జూన్ 20 నుంచి టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. ఐపీఎల్ అయిపోయిన వెంటనే వారం రోజుల గ్యాప్ లో భారత జట్టు ఇంగ్లాండ్ కు పయనమవనుంది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్ వేదికగా 5 టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ఆడాల్సి ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్స్ షిప్ 2025-27 సైకిల్ లో టీమిండియాకు ఇదే తొలి సిరీస్. ఈ సిరీస్ కు భారత జట్టును మే రెండో వారంలో ప్రకటించే అవకాశం ఉంది. ఈ సారి ఇండియా ఎక్కువగా యంగ్ ప్లేయర్లతోనే బరిలోకి దిగబోతుంది. ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కు ముందు ఇంగ్లాండ్ లయన్స్ తో యంగ్ ఇండియా రెండు ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ల సిరీస్ ఆడుతుంది. హెడ్డింగ్లేలో జూన్ 20 న తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. సిరీస్‌లోని మిగతా నాలుగు టెస్టులకు ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్ ట్రాఫోర్డ్ ఓవల్ వేదికలు కానున్నాయి. 2021-22 చివరిసారిగా భారత్ ఇంగ్లాండ్ లో పర్యటించింది. ఈ సిరీస్ 2-2 తో సమంగా ముగిసింది. గత ఏడాది ప్రారంభంలో ఇంగ్లాండ్, భారత్ చివరిసారిగా టెస్ట్ సిరీస్ ఆడాయి.

# మిరాకిల్ జరిగితేనే ప్లే ఆఫ్స్: సన్ రైజర్స్ టాప్- 4 కు రావాలంటే ఇలా జరగాలి!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో సన్ రైజర్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు దాదాపుగా ముగిశాయి. ఏదైనా అద్భుతంగా జరిగితే తప్ప హైదరాబాద్ జట్టు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించడం దాదాపు అసాధ్యం. పది మ్యాచ్‌ల్లో ఏడింటిలో ఓడి ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపు వైదొలిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. ప్లేఆఫ్స్ రేసులో ముందంజ వేయాలని ఆశిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ తో సోమవారం(మే 5) ఉప్పల్ స్టేడియంలో అమీ తుమీ తేల్చుకోనుంది. సన్ రైజర్స్ ప్లే ఆఫ్స్ కు క్వాలిఫై అవ్వాలంటే ఏం జరగాలో ఇప్పుడు చూద్దాం.
సన్ రైజర్స్ 10 మ్యాచ్ ల్లో 3 విజయాలతో 6 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 9 స్థానంలో ఉంది. మరో నాలుగు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. వీటిలో నేడు ఢిల్లీ క్యాపిటల్స్ తో తలపడనుంది. ఆ తర్వాత కోల్ కతా నైట్ రైడర్స్, లక్నో సూపర్ జయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుతో మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. మొదట ఈ నాలుగు మ్యాచ్ ల్లో సన్ రైజర్స్ భారీ విజయం సాధించాలి. అదే సమయంలో కోల్ కతా ఒక మ్యాచ్ లో ఓడిపోవాలి. ఇక ముంబై లేదా గుజరాత్ తాము ఆడబోయే మిగిలిన అన్ని మ్యాచ్ లు ఓడిపోవాలి. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జయింట్స్ తాము ఆడబోయే చివరి మ్యాచ్ ల్లో ఒకటి కంటే ఎక్కువ గెలవకూడదు.
సన్ రైజర్స్ మిగిలిన మూడు మ్యాచ్ ల్లో గెలిచినా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (16), పంజాబ్ కింగ్స్ (15) కంటే వెనకే ఉంటుంది. మంగళవారం (మే 6) గుజరాత్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య జరగబోయే మ్యాచ్ లో ఏ జట్టు గెలిచినా 16 పాయింట్లు సాధిస్తుంది. ఈసీజన్ లో ఎలా చూసుకున్నా సన్ రైజర్స్ టాప్ -3 లో ఉండే అవకాశం కనిపించడం లేదు. నాలుగో స్థానం ఆరాటపడుతున్న సన్ రైజర్స్ కు తాము ఆడబోయే నాలుగు మ్యాచ్ లు గెలవడంతో పాటు మిగిలిన మ్యాచ్ ల ఫలితాల కోసం ఎదురు చూడాల్సి ఉంది. ఒకవేళ నేడు జరగబోయే మ్యాచ్ లో సన్ రైజర్స్ ఓడితే ప్లే ఆఫ్స్ నుంచి అధికారికంగా నిష్క్రమిస్తుంది.

# ఇంగ్లండ్ పర్యటనకు భారత్-ఎ జట్టు.. మే 25న తొలి బృందం!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో జరగనున్న కీలకమైన ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు, భారత సీనియర్ జట్టుకు అవసరమైన సన్నాహకాలను అందించేందుకు భారత్-ఎ జట్టు ఇంగ్లండ్ పర్యటనకు సిద్ధమవుతోంది. భారత్-ఎ జట్టులోని తొలి బృందం మే 25న ఇంగ్లండ్‌కు బయలుదేరే అవకాశాలున్నాయి. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇప్పటికే అవసరమైన ప్రయాణ ఏర్పాట్లను ప్రారంభించినట్లు తెలిసింది.
ఈ పర్యటనలో భాగంగా భారత్-ఎ జట్టు, ఇంగ్లండ్ లయన్స్‌తో 3 నాలుగు రోజుల మ్యాచ్‌లను ఆడనుంది. మే 30న క్యాంటర్‌బరీ వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభమవుతుంది. సీనియర్ జట్టు ఇంగ్లండ్‌తో జూన్ 20 నుంచి టెస్ట్ సిరీస్ ఆడనున్న నేపథ్యంలో, అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు ఈ మ్యాచ్‌లు కీలకం కానున్నాయి. ప్రస్తుతం జట్టును అధికారికంగా ప్రకటించనప్పటికీ, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సీనియర్ సెలక్షన్ కమిటీ గుర్తించిన ఆటగాళ్ల బృందానికి సంబంధించిన లాజిస్టిక్స్ ప్రక్రియను బీసీసీఐ వేగవంతం చేసింది. పలువురు ఆటగాళ్ల పాస్‌పోర్ట్‌లు, జెర్సీ సైజుల వివరాలను సేకరించినట్లు సమాచారం. ఐపీఎల్ నాకౌట్ దశకు చేరుకోని ఆటగాళ్లు ముందుగా మే 25న బయలుదేరే బృందంలో ఉంటారని, మిగిలిన వారు తమ ఐపీఎల్ బాధ్యతలు ముగిసిన తర్వాత జట్టుతో కలుస్తారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, టెస్ట్ సిరీస్ ఆడనున్న ప్రధాన జట్టు ఆటగాళ్లు జూన్ మొదటి వారంలో ఇంగ్లండ్‌కు వెళ్లే అవకాశం ఉంది. ముఖ్యంగా, కొందరు సీనియర్ ఆటగాళ్లు అక్కడి వాతావరణానికి అలవాటు పడేందుకు, ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్‌కు బదులుగా రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లో ఆడాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, వారి ఐపీఎల్ ప్రదర్శన, మెడికల్ టీమ్ క్లియరెన్స్‌పై ఇది ఆధారపడి ఉంటుంది. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఇదే తరహాలో ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లు ముందుగా వెళ్లి అక్కడి 'ఎ' జట్టుతో మ్యాచ్‌లు ఆడారు. సుదీర్ఘమైన ఐపీఎల్ సీజన్ తర్వాత ఆటగాళ్లకు తగిన విశ్రాంతి, కోలుకునే సమయం ఇవ్వాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ వేసవిలో భారత్-ఎ జట్టుతో పాటు భారత అండర్-19, మహిళల జట్టు, మిక్స్‌డ్ డిజేబిలిటీ జట్లు కూడా ఇంగ్లండ్‌లో పర్యటించనున్నాయి. భారత మహిళల జట్టు ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుండగా, అండర్-19 జట్టు ఐదు వన్డేలు, రెండు టెస్టుల్లో తలపడే అవకాశం ఉంది.

# త్రివిక్రమ్ కు పెద్ద పరీక్షే!



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ త్వరలోనే విక్టరీ వెంకటేష్ తో కలిసి వర్క్ చేయడానికి రెడీగా ఉండగా, ఆ ప్రాజెక్టు ఇప్పుడు ఆల్మోస్ట్ కన్ఫర్మ్ అయినట్టు తెలుస్తోంది. అల్లు అర్జున్ నుంచి ఓ చిన్న పర్మిషన్ వస్తే వెంకీ- త్రివిక్రమ్ ప్రాజెక్ట్ అఫీషియల్ గా అనౌన్స్ కానుంది. అయితే ఈ సినిమాకు పెద్దగా అడ్డంకులు కూడా ఏమీ ఉండకపోవచ్చు. బన్నీ ఆల్రెడీ అట్లీ సినిమాతో బిజీగా ఉన్నాడు కాబట్టి అట్లీ సినిమా పూర్తి చేసుకుని బన్నీ ఫ్రీ అయ్యే టైమ్ కు వెంకీతో సినిమాను ఫినిష్ చేసి త్రివిక్రమ్ కూడా రెడీగా ఉంటాడు. కాబట్టి బన్నీ నో చెప్పడానికి కూడా పెద్దగా రీజన్స్ ఏమీ లేవు. అయితే వెంకీతో చేయబోయే ఈ సినిమా త్రివిక్రమ్ కు ఓ పెద్ద ఛాలెంజ్ కాబోతుంది.
వెంకటేష్- త్రివిక్రమ్ కాంబినేషన్ ఇప్పటిది కాదు. వీరి కాంబినేషన్ లో ఇప్పటికే నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి లాంటి క్లాసిక్ సినిమాలొచ్చాయి. అయితే త్రివిక్రమ్ ఆ సినిమాలకు డైరెక్టర్ కాదు. ఆ రెండు సినిమాలకు త్రివిక్రమ్ కేవలం రైటర్ గా మాత్రమే పని చేశాడు. ఆ సినిమాల్లో త్రివిక్రమ్ రైటింగ్ గురించి ఇప్పటికీ గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. త్రివిక్రమ్ డైరెక్టర్ అయినప్పటి నుంచి వీరిద్దరి కలయికలో సినిమా ఎప్పుడొస్తుందా అని దగ్గుబాటి ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ ఇప్పటివరకు వీరి కాంబినేషన్ లో సినిమా రాలేదు. ఇప్పుడది



కార్యరూపం దాలుస్తుందని తెలియడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా నుంచి ఆడియన్స్ కొత్త కథను, కొత్త ఎంటర్టైన్మెంట్ ను ఆశిస్తున్నారు. అయితే త్రివిక్రమ్ కు ఈ ప్రాజెక్టు వల్ల చాలా ఒత్తిడే ఉండనుంది. ఆల్రెడీ మొన్న సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాంతో అనిల్ రావిపూడి వెంకటేష్ బెంచ్‌మార్క్ ను చాలా భారీగా పెంచేశాడు. ఇప్పుడు త్రివిక్రమ్ దాన్ని మించిన సినిమా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మంచి ఫామ్ లో ఉన్న టైమ్ లో త్రివిక్రమ్ వెంకీ కోసం చాలా బలమైన కథను రాయాలి. డైరెక్టర్ మీద నమ్మకంతో గుడ్డిగా ముందుకెళ్లే ప్రయత్నం దగ్గుబాటి బ్రదర్స్ తీసుకోరు. దాంతో పాటూ ఈ సినిమా కూడా సంక్రాంతికి రిలీజ్ అంటున్నారు కాబట్టి కచ్చితంగా త్రివిక్రమ్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం కంటే పెద్ద సక్సెస్ అవాలి. అన్నింటికంటే ముఖ్యంగా త్రివిక్రమ్ ఈ సినిమాతో తన సత్తాను చాటకపోతే ఆ ఎఫెక్ట్ తను అల్లు అర్జున్ తో చేయబోయే నెక్ట్స్ ప్రాజెక్ట్ పై పడుతుంది. కాబట్టి ఈ ప్రాజెక్టు త్రివిక్రమ్ కు చాలా పెద్ద ఛాలెంజనే చెప్పాలి.



థగ్ లైఫ్ ప్రమోషన్స్ కోసం త్రిష కృష్ణన్ చీర లుక్‌లో చూడముచ్చటగా ఉంది

సమంత రూత్ ప్రభు కంటే క్యాజువల్ స్టైల్‌ను ఎవరు బాగా నెయిల్ చేయగలరు?

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com